ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 30, 2014

కోణార్క్ నృత్యోత్సవం

వెలుగుజాడ....

దుబాయ్‌లో ధూంధాం

ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఏసియన్ అవార్డ్స్ 2014 విజయవంతమైంది. ఈ గ్రాండ్ ఈవెంట్‌లో బాలీవుడ్ సెలబ్రెటీలు రెడ్ కార్పెట్ మీద నడుస్తూ అందంగా కనిపించి, కనువిందు చేశారు. ఆ బ్యూటీస్ ఎవరో తెలుసా? ఐశ్వర్య రాయ్, కరీనా కపూర్. ఐశ్వర్యరాయ్ ఎరుపురంగు ఎంతో అందంగా కనిపించింది. ఐశ్వర్యరాయ్ ఫేవరెట్ డిజైనర్స్‌లో ఒకరైన అబు జానీ, సందీప్ కోషల్ డిజైన్ చేసిన అనార్కలీ డ్రెస్సులో ఆమె మెరిసిపోయింది. ఇక కరీనాకపూర్ డిజైనర్ విక్రమ్ ఫడ్నీస్ డిజైన్ చేసిన శారీలో అందరినీ ఆకర్షించగలిగింది. వీరిద్దరూ స్టేజ్ మీద డ్యాన్స్ చేసి, ఆహుతుల్ని మరింత అలరించారు.

ఆరాధ్యా బచ్చన్‌ను ఎత్తుకొని ఏసియన్ అవార్డ్స్ 2014లో ఐశ్వర్యరాయ్ ఇలా ఫోటోకు ఫోజు ఇచ్చింది. ఆరాధ్య చాలా క్యూట్‌గా కనిపించింది. ఐష్ రెడ్ ఫుల్ స్లీవ్ డ్రెస్‌లో గ్రాండ్‌గా కనిపించింది. ఈ డ్రెస్సు మొత్తం భారీగా డిజైన్ చేయబడినది. నెక్‌లైన్ ప్యాట్రన్ కూడా చాలా స్టైలిష్‌గా ఆకట్టుకొనే విధంగా ఉంది. రెడ్ అనార్కలీ డ్రెస్సుకు ఫర్ఫెక్ట్ మేకప్‌తో అత్యంత అద్భుతంగా కనిపించింది.

బ్యూటీఫుల్ శారీ మీదకు కరీనాకపూర్ అందమైన ఆభరణాలను ఎంపిక చేసుకొంది. సాంప్రదాయిక కళ ఉట్టిపడుతున్నట్లు కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకొంది. కరీనాకపూర్ ధరించిన రెడ్‌శారీ గోల్డ్ కలర్‌తో ఎక్కువగా డిజైన్ చేశారు. అంతే కాదు, శారీ బార్డర్, పల్లు, చీరంతా చిన్న గోల్డ్ ఫ్లవర్స్‌తో ఫర్ఫెక్ట్ మ్యాచింగ్‌గా విక్రమ్ ఫడ్నీస్ డిజైన్ చేశారు.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

బడా చోర్...

'బహిరంగంగా చేయాలి. మూడో కంటికి తెలీకూడదు' ఏమిటది? అదేనండీ దొంగతనం. ఏమాత్రం అనుమానం రాకుండా విలువైన వస్తువులను కొట్టేయడం చిన్న విషయమా. అదెంత కష్టమో చెమటోడ్చిన దొంగకే తెల్సు. అందుకు బో...లెడంత నైపుణ్యం కావాలి. బ్లేళ్లూ, కత్తెర్లూ బీభత్సంగా పదును పెట్టుకెళ్లినా... పట్టుబడకుండా బైటపడతారన్న గ్యారంటీ లేదు. ఒకవేళ చేతికి చిక్కారో! కుళ్లబొడవకుండా వదులుతారన్న నమ్మకం లేదు. అయినా సరే... చోరీలు ఆగేదే లేదు. అలా జరిగిపోతుంటాయంతే!

పాతకాలంలో దొంగలు అంటే చాలు! గళ్ల లుంగీలు - చొక్కాలు, బుగ్గ మీద పులిపిరి, బొడ్లో కత్తి వున్న భారీ కాయం ఒకటి గుర్తొచ్చేది. అప్పుడంటే దొంగకు ప్రత్యేకమైన యూనిఫారం ఒకటి కుట్టి పెట్టారు రచయితలు, సినీ దర్శకులు. మరి ఇప్పుడో! వారి ఆహార్యంలో పెను మార్పులు వచ్చేశాయి. దొంగలు మన పక్కనే వుంటారు. మనతోనే వుంటారు. మన చుట్టూనే వుంటారు. కానీ దొంగ అని మాత్రం తెలీదు. దొంగతనం జరిగే వరకూ! వీడియో కెమెరాలు పట్టించేవరకూ!! అందుకే అంటుంటారు 'దొరికే వరకూ అందరూ దొరలే' అని.

మామూలు వాళ్ల పర్సులు కొట్టేస్తే కిక్కేముంటుంది?! సెలబ్రెటీల పర్సులు, బ్యాగులు కొట్టేస్తే! పెద్ద సెన్సేషన్. వెంటనే పత్రికల్లో వార్తలొచ్చేస్తాయ్. టీవీల్లో బ్రేకింగ్ న్యూస్ డిస్కో డాన్స్ చేసేస్తాయ్. ఈ మధ్య మన పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగారి పర్స్ కొట్టేశాడో చోరాగ్రేసరుడు. అదీ విదేశాల్లో. ఎందుకూ పనికి రాని పాస్‌పోర్ట్ పక్కకు విసిరేసి .... కేవలం తనకు కావాల్సినంత వరకే నొక్కేశాడా తెలివైన దొంగ. ఈ విషయాన్ని విదేశీ స్వదేశీ జాతీయ రాష్ట్రయ పత్రికలన్న తేడా లేకుండా అన్నీ అచ్చేశాయి. 'అబ్బో... పర్సు కొట్టేసి మంత్రిగారికే మడత కాజా ఇచ్చాడంటే వీడు మామూలోడు కాదు' అనుకున్న వాళ్లూ వుండి వుంటారు. ఈయనేం ఖర్మ! అమెరికా అధ్యక్షుడు బుష్షు గారి ...అమ్మాయి గారి పర్సు కూడా కొట్టేశాడో చెయ్యి తిరిగిన దొంగ. 'అస్సలు...అంతమంది రక్షక భటుల మధ్యలోంచి బేబీ బుష్ బ్యాగ్ ఎలా కొట్టేశాడూ?' అని అప్పట్లో పెద్ద కథనాలే వచ్చాయనుకోండి. అయినా సరే. వైట్ హౌస్ నుంచి ఒక్క ప్రకటన కూడా రాలేదు! మరి నామోషీ కదా. ఇక లోకల్ దొంగతనాల కొద్దాం. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగారి సతీమణిగారి పర్సు కూడా చోరీ అయ్యిందోసారి. ఆవిడగారు హాయిగా ఏసీ రైల్లో ప్రయాణిస్తుండగా... అదను చూసుకుని బరువా...టి పర్సు నొక్కేశారు. అప్పుడూ ఇది పెద్ద వార్తే అయ్యింది.

అయినా వీళ్లదేముంది! అంతా చిల్లర దొంగలే. చోర కళలో ఆరితేరిన పెద్ద మనుషులు బోలెడు మంది. మనం చూస్తుండగానే ...మన కళ్లెదుటే ...మన జేబులు కొట్టేస్తారు దర్జాగా. మన సొమ్మంతా దోచేస్తారు రుబాబుగా. కాకపోతే 'దొంగతనం జరిగింది' అన్న వార్త రాదు పత్రికల్లో, చానళ్లలో. 'స్కాములు, కుంభకోణాలు జరిగాయి' అని వస్తాయి పోలిష్డ్‌గా. ఈ సో కాల్డ్ వైట్ కాలర్ దొంగలకు శిక్షలు పడాలంటే... ఏళ్లూ పూళ్లూ అలా గడిచిపోవాలంతే!

చివరాఖరుగా మరో పెద్ద దొంగ గురించి తప్పక ప్రస్తావించుకోవాలి. ప్రతి రోజూ మన జేబులు కొట్టేయందే ఈ దొంగకు అస్సలు నిద్ర పట్టదు. అదెవరో తెల్సా! ప్రభుత్వం. దానికి శిక్ష కూడా వుండదెందుకో! అది లీగల్ దొంగతనం కనకా! ఏ...మో...! ■

◆ మనలో మాట

టపా

పలు విషయాలు తెలిశాయి

ఎగ్ ఫ్రీజింగ్ గురించి చక్కటి సమాచారం అందించారు. స్త్రీలపైనే నేడు అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి. మొదట అందం గురిం, తల వెంట్రుకల గురించి సరుకులు తయారుచేసి మార్కెట్ చేసుకునేవారు. ఊబకాయం నివారణకు మందులే మార్గం అంటున్నారు. అద్దె తల్లి కడుపులో పిల్లల్ని పెంచి పురుడు పోసుకొన్న తర్వాత తెచ్చి పెంచుకుంటున్నారు. పాలిండ్ల సొగడు తగ్గుతుందని పిల్లలకు పాలు పట్టని తల్లులున్నారు. మానవ సంబంధాల కంటే మార్కెట్ సంబంధాలు పెరిగాయి. ఎగ్ ఫ్రీజింగ్‌లో అనేక సమస్యలా! స్త్రీలు అనారోగ్యం పాలైతే కార్పొరేట్ ఆసుపత్రులకు లాభం. కృత్రిమ పద్ధతులు హానికరం. ఈ వ్యాసం ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం.

టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

◆◆◆◆

ఆలోచనాత్మక సీరియల్

మార్క్స్ జెన్నీ ప్రేమ కథ ప్రేమ విప్లవం సీరియల్ ఉన్నతంగా ఆలోచనాత్మకంగా పరిశోధనాంశంగా నేటి రచయితలకు స్ఫూర్తిగా పెట్టుబడి దారీ వ్యవస్థకు చెంపపెట్టుగా వుంది. ముక్తవరం పార్థసారథి గారి స్వేచ్ఛానువాదం అద్భుతం. వారికి మనస్ఫూర్తిగా అభినందనలు. మంచి విప్లవాత్మక రచనలు ప్రచురించడం ముదావహం.

కె.వి.రమణారెడ్డి, మార్కాపూర్, ప్రకాశం.

◆◆◆◆

నిజంగా పిడుగులే!

ఈవారం పిల్లలు కాదు పిడుగులు అంటూ మా ముందు వుంచిన చిన్నారుల జీవితం నిజంగా స్ఫూర్తిదాయకంగా వుంది. వయసుకు మించిన పనులు చేశారు వాళ్లు. బాల్య వివాహాలకు ఎదురుతిరగడం చిన్న విషయమా! అందుకు మన దేశానికి చెందిన రేఖా కాళిందిని ఎంతైనా అభినందించాలి. అలాగే ఎమెన్ బాలిక ! పదేళ్లకే విడాకులకోసం పోరాడడం...అందునా అలాంటి దేశాల్లో...! మాటలు కాదు. గుండె నిండా ధైర్యం వుండాలి. ఇక పాకిస్తాన్ పిల్లాడు! చూడ్డానికి బక్కగా నిలబడడానికి ఓపికలేనట్టు కనిపించే పిల్లాడు! ఎంత సాహసం చేశాడు. స్వేచ్ఛ పొందడానికి యమకింకరుల్లాంటి యాజమాన్యం నుంచి తప్పించుకున్నాడు. ఎయిడ్స్ వంటి మహమ్మారి పట్టి పీడిస్తున్నా ... ఎలా బతకాలో ... చెప్పిన కోశి మామూలు పిల్లాడా! అందరూ అందరే. వీరి గురించి పుస్తకం తీసుకురావడం నిజంగా **అభినందనీయం.**

బి. కళ్యాణి, వైజాగ్.

◆◆◆◆

అన్ని దానాల్లోకి రక్తదానం మిన్న

అట్టమీది కథగా 'ప్రాణదాతలు' గురించి చదివి ఎంతో తెలుసుకున్నాం. రక్తదానం గురించి అప్పటి వరకు మాలో వున్న అపోహలు కొన్ని తొలిగిపోయాయనుకోవాలి. అలా ఒక వెబ్‌సైట్ ద్వారా ఎందరికో ప్రాణాలు పోసిన...పోస్తున్న సైట్ నిర్వాహకులను మెచ్చుకోవాల్సిందే.

ఎం. కన్నయ్య, విద్యానగర్, గుంటూరు.

ఈ సంచికలో....

వెలుగుజాడ

కవర్‌స్టోరీ 14



తెలుగు సాహితీ రంగానికి ముత్యాల సరాలతో ఆధునిక సొబగులద్ది సామాన్యుడి చెంతకు చేర్చిన వైతాళికుడు గురజాడ. మహాకవి గురజాడ జీవించింది అయిదు పదులే అయినా పది కాలాల పాటు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశాయి ఆయన రచనలు. ఆయన నూరవ వర్థంతి సంవత్సరమిది.ఈ సందర్భంగా అట్టమీది కథలో గురజాడను స్మరించుకుందాం.

సమ్‌థింగ్ స్పెషల్ 3
కెనడాలో మిలియన్ డాలర్ బేబీ

కార్టూన్ కదంబం 5

కథ 6
పరాధీనం!

రుచి 8
వడలు వెరైటీగా

వింతలోకం 9
బాబోయ్ బ్రష్షే

కవిత్వం 10
బాల్యం బందిఖానా

నవ్వుల్ - పువ్వుల్ 11

సందర్భం 12
భారతీయ నాట్యాల సమ్మేళనం కోణార్క్ నృత్యోత్సవం

ప్రత్యేకం 14
ఆ అయిదుగురు

సీరియల్ 19
ప్రేమ విప్లవం

బాలనేస్తాలు 22
పావురం- కాకి కథ

కొత్త పుస్తకాలు 24
వెన్నెల లాంటి కథలు

చూద్దామా 4
సుందరసీమ సియోల్

భట్టి విక్రమార్క కథల్లో సంక్లిష్టమైన బేతాళుడి ప్రశ్నలు, సహస్రశిరచ్ఛేద చింతామణి ప్రశ్నల వంటి కష్టమైన, క్లిష్టమైన, తక్షణం సమాధానం దొరకని ప్రశ్నల పరిస్థితి తలెత్తినపుడు ఆంగ్ల సాహిత్యంలో మిలియన్ డాలర్ ప్రశ్నగా ప్రస్తావించటం ఎప్పుడో ఒకపుడు వినే ఉంటారు. అలా గే మిలియన్ డాలర్ బేబీ పేరుతో ఆంగ్లంలో సిని మాలు కూడా వచ్చాయి, ఇప్పుడు మనం చెప్పుకో బోయేది నిజంగా మిలియన్ డాలర్ బేబీ గు రించే. మిలియన్ డాలర్లంటే మన కరెన్సీలో అక్షరాలా అరుకోట్ల రూపాయలకు పైమాటన్న మాట.

కెనడాలో మిలియన్ డాలర్ బేబీ

కెనడా దేశంలోని సాస్‌కచెవాన్ రాష్ట్రంలో జెన్నిఫర్ హుకులాక్ అనే తల్లికిపుడు పెద్ద కష్టం వచ్చి పడింది. నెలలు నిండకుండానే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉన్నందుకు గుండెలకు హత్తుకొని మురిసి పోవాలో అందుకుగాను తొమ్మిదిన్నర లక్షల డాలర్లు (ఐదు కోట్ల 86లక్షల, 81వేల 277 రూపాయలు) కట్టమంటూ వచ్చిన ఆసుపత్రి బిల్లును చూసి గుండెలు బాదుకోవాలో తెలియని పరిస్థితిలో పడిపోయింది జెన్నిఫర్ కుటుంబం.

ఆరునెలల గర్భవతిగా ఉన్న జెన్నిఫర్ తన భర్తతో కలసి 2013లో కెనడా నుంచి అమెరికాలోని హవాయి దీవులకు విహార యాత్రకు వచ్చింది. రెండు రోజుల తరువాత ఉమ్మనీరు పడిపోవటంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. బెడ్‌రెస్ట్ తీసుకోవాలని డాక్టర్లు చెప్పారు. అయితే ఆరువారాలకే నెప్పులు వచ్చి నెలలు నిండకుండానే ఒక బిడ్డకు జన్మనిచ్చింది. తరువాత కుమార్తెతో సహా కెనడా వెళ్లిపో యింది. ఇప్పుడు అంత మొత్తం బిల్లు చూసి ఎలా కట్టాలి, ఎక్కడి నుంచి తేవాలంటూ గొల్లుమంటోంది.

జెన్నిఫర్ జంట బ్లూ క్రాస్ అనే సంస్థ నుంచి ప్రయాణ బీమా తీసుకుంది. తాము పాలసీ జారీ చేయక ముందే ఆమె నాలుగునెలల గర్భవతిగా ఉండగా ఆమెకు ఇన్ఫెక్షన్ ఉందని, హవాయిలో ఉండగానే బీమా గడువు తీరినం దున తాము బీమా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని వాదిస్తోంది. అయితే తనకు ఉమ్మనీరు పోయినప్పటికీ ప్రయాణం చేయవచ్చని వైద్యులు చెప్పారని, అయితే తనను ఆస్థితిలో కెనడాకు తరలించే సదుపాయం ఉన్న కంపెనీ ముందుకు రాలేదని దీనిలో తన తప్పేముందని జెన్నిఫర్ వాదిస్తోంది.ఆమెతో పాటు విమానంలో మొత్తం ఆపరేషన్ బృందం అందుబాటులో ఉండాలని అది తమవల్ల కాదని కంపెనీలు నిరాకరించాయి.

అమెరికాలో ఉన్న చట్టాలు విదేశీయులకు వర్తించని కారణంగా ఇతర జబ్బులకు భారీ మొత్తాలలో ఆసుపత్రి బిల్లులు రావటం సాధారణ విషయమే. కానీ ప్రసవ బిల్లు ఇంతగా రావటం మాత్రం అసాధారణమే. తమ ప్రభుత్వం సాయం చేస్తే బిల్లు చెల్లించటం లేదా బ్లూక్రాస్ కంపెనీపై దావా వేయటం, ఏదీ కాకపోతే దివాలా ప్రకటించటం గురించి జెన్నిఫర్ కుటుంబం ఆలోచిస్తోంది.

అమెరికాలో సహజ కాన్పుకు ఆసుపత్రులు 30వేల డాలర్లు తీసుకుంటాయి, అదే సిజేరియన్ చేస్తే 50వేలు. ఇంత ఎక్కువ ఉంటున్న కారణంగా పేదలు కాన్పులకు బీమా చేయించు కోలేరు. జెన్నిఫర్ కాన్పుకు ముందు ఆసుపత్రిలో ఉండటం, నెలలు నిండకుండానే ప్రసవించ టంతో కుమార్తె రెండు నెలలు ఆసుపత్రిలో ఉండాల్సి రావటంతో బిల్లు తడిచి మోపెడైంది.

ఈ విషయం సామాజిక మీడియాలో రావటంతో కొంత మంది విరాళాలు ఇస్తామని ముందుకు రాగా తమకు అలా తీసుకోవటం ఇష్టం లేదని జెన్నిఫర్ కుటుంబం పేర్కొన్నది. ఈ ప్రచారం వలన బ్లూ క్రాస్ కంపెనీకే నష్టమని, తమ ఉద్యోగి తప్పిదం వలన తామే బిల్లు చెల్లిస్తామని ఆ కంపెనీయే ముందుకు రావచ్చని ఆశాభావం వెలిబుచ్చింది.

కెనడాలో మరో మిలియన్ డాలర్ బేబీ ఉన్నట్లు ఈ సందర్భంగా మీడియా పాత విషయాలను బయటకు తీసింది. జెన్నిఫర్ మాదిరి 1997లో లారీ ఊల్ఫ్ అనే మహిళ అమెరికాలో నెలలు నిండకుండానే బిడ్డను కన్నది. ఆ ఉదంతంలో పౌరుల నుంచి వత్తిడి రావటంతో కెనడా ప్రభుత్వం బిల్లు చెల్లించింది. జెన్నిఫర్ ఉదంతం తనకు పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చిందని ఊల్ఫ్ కుటుంబం సానుభూతి పలికింది. తమ ఉదంతం అంతర్జాతీయ మీడియాలో రావటంతో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున వత్తిడి వచ్చిందని, అత్యవసర నిధి నుంచి చెల్లింపులు జరిపినట్లు తెలిపింది.

- సత్య



సుందరసీమ సియోల్

◆ చూద్దామా

మామూలుగా విదేశీయులు, ముఖ్యంగా పడమటి దేశాలవారు వ్యాపార పనుల నిమిత్తమే దక్షిణకొరియా సందర్శిస్తూ వుంటారు. వ్యాపారపు లావాదేవీలకు కూడలి స్థలం సియోల్ పట్టణమే కాబట్టి ఆ నగరం సందర్శించక ఎటూ తప్పదు. అయితే అక్కడకు అడుగెట్టాక ఆకట్టుకొనే అంశాలు అన్నీ ఇన్నీ కావు...చూసి తీరాల్సిందే.

సుందర పర్వత శ్రేణులతో నిండిన దేశం కొరియా. ఎటు చూసినా దూరం నుంచి సూర్యరశ్మిలో మెరుస్తున్న ఎత్తయిన పర్వత శిఖరాలే దర్శనమిస్తాయి. ఎత్తయిన పర్వతాలతో, దట్టమైన అడవులతో, సుందరమైన నదులతో చక్కని ప్రకృతి సంపదతో సందర్శకులను పరవశింపచేసే దేశం దక్షిణ కొరియా. భూభాగం వైశాల్యం 98,955 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మహా వుంటే న్యూజిలాండ్ అంత వుంటుంది. అయినా కొరియా ప్రత్యేకత కొరియాదే. కొరియాకు 5 వేల సంవత్సరాలకు మించిన పూర్వచరిత్ర వుంది. తనదంటూ చెప్పుకోదగ్గ విశిష్టమైన సంస్కృతీ సంప్రదాయాలున్నాయి.

చారిత్రకంగా పరిశీలిస్తే కొరియా లోగడ చైనా వారి దండయాత్రలకు... జపాన్‌వారి యుద్ధకాంక్షకు... మంగోలుల దాడులకూ గురైంది. అయినా ఇంతమంది దురాక్రమణలనూ దండయాత్రలనూ తట్టుకొంటూ నిలబడ్డ చరిత్ర కొరియాకు వుంది. తమ వ్యక్తిత్వాన్ని సంస్కృతినీ కాపాడుకున్న ఘనత కొరియన్లకు వుంది. కొరియావారి జీవనవిధానం ఒక విధంగా చైనా జపాన్‌వారి జీవన విధానాలను పోలివుంటుంది. అయినా కొరియన్ల ప్రత్యేకత కొరియన్లదే.

మూలపురుషుడు

కొరియావారి మూలపురుషుడు టాంగున్. ఇతడే కొరియన్ల మూలపురుషుడుగా వారు నమ్ముతారు. అంతే కాక ప్రపంచాన్ని ఏలిన మొదటి మానవ చక్రవర్తి టాంగున్ అని కూడా కొరియన్లు విశ్వశిస్తారు. కొరియాకు మాత్రం చాలా ప్రాచీనమైన చరిత్ర వుందని పరిశోధకులంతా అంగీకరించిన విషయమే. కొరియన్లకు మతవిశ్వాసాలు కూడా ఎక్కువే. విదేశీయులను వీరు ఎంతగానో ఆదరిస్తారు.

ముఖ్య ఆకర్షణ

కొరియా వెళ్లినవారిని ముఖ్యంగా ఆకర్షించేది సియోల్ నగరమే. "నీకొక గుర్రం వుంటే చెజూ ద్వీపం చుట్టిరావటానికి పంపించు. నీకొక కొడుకుంటే సియోల్ నగరం చూడటానికి పంపించు" అని కొరియాలో ఓ సామెత వుంది. ఈ సామెత అక్షరాలా నిజమేనని చెప్పుకోవచ్చు. చెజూ ద్వీపం ఆకుపచ్చని గడ్డితో కళకళలాడుతూ వుంటుంది. గుర్రాలకు చక్కని మేత దొరకుతుందక్కడ. అలాగే సియోల్ సుందరమైన నగరం. అందమైన పార్కులతో,

చూడచక్కని మ్యూజియంలతో బజార్లతో శోభిల్లుతూ వుంటుంది. ఎవరికైనా సియోల్ నగర సందర్శనం చక్కని అనుభూతినే కలిగిస్తుంది. మధురమైన స్మృతులనే మిగిలిస్తుంది. ఒకసారి సియోల్‌ను దర్శించినవారు మరి దాన్ని వదిలిపెట్టి వెళ్ళరేమో అనిపిస్తుంది. అందుకే గడిచిన పది సంవత్సరాలలో ఈ నగరజనాభా ఇంతింతనకుండా పెరిగిపోయి. ఈనాటికి ఒక కోటికి చేరుకొంది. ప్రపంచంలో అత్యధిక జనాభాకల నగరాలలో సియోల్ మూడోస్థానం ఆక్రమిస్తుంది.

సియోల్ టవర్

నామ్‌సన్, వుగక్‌సన్ అనే రెండు పర్వతాల మధ్యగా అమరివున్న అందమైన నగరం సియోల్. నిజానికి సియోల్‌నగర సౌందర్యాన్ని తనివితీరా చూడాలంటే సియోల్‌టవర్ మీద నుంచి చూడాల్సిందే.

నామ్‌సన్ వుగక్‌సన్ పర్వతాలు ఒక విధంగా సియోల్‌నగర సౌందర్యానికి రక్షణ కలిగిస్తూ కాపలా కాస్తున్నాయనే చెప్పుకోవాలి. అసలీ పర్వతాలే సౌందర్యసీమలు. ఈ పర్వతాలపై వున్న పార్కులు, తోటలు, కోటలు సందర్శకులు విధిగా చూడవలసిన సుందరస్థలాలు. ఈ తోటలు, దొడ్లు, కోటలవల్ల ఈ పర్వతాల సౌందర్యం ఇనుమడిస్తోందా, లేక కొండల ప్రకృతి సౌందర్యపటిమవల్లే మిగతాస్థలాలన్నీ రాణిస్తున్నాయా అన్నది సందర్శకులు ఎవరికివారే తేల్చుకోవలసిన విషయాలు.

హన్‌నది విహారాలు

ఈ సుందర పర్వతశ్రేణులు తర్వాత సందర్శకులను అమితంగా ఆకర్షించేది హన్‌నది. సియోల్ నగరానికి ఆభరణం లాంటిది ఈ నది. హన్‌నది మీదున్న అనేక

వంతెనలు సౌందర్యప్రియులకు సమావేశస్థలాలు. హన్‌నది వొడ్డునవున్న పచ్చికబయళ్లు యువతీయువకులకు సంకేత స్థలాలుగా భావిస్తూ వారికి కావలసినంత ఏకాంతాన్ని ప్రసాదిస్తూ వుంటాయి. హన్‌నదిలోని పడవ విహారాలనుగురించి ఇహచెప్పే పనేలేదు. నిర్మలమైన ఈ నీటిలో చక్కని పడవలో చల్లనిగాలిలో ప్రయాణంచేస్తుంటే ఏమిహాయిలేహలా అంటూ ఎవరయినా పరవశించిపోవాల్సిందే.

ఇసున్‌సిన్

సియోల్ సందర్శించినవారు తప్పకుండా సందర్శించాల్సింది. సిటీహాల్ ప్లాజా ఒకటి. ఈ కట్టడం చుట్టూ వున్న ఫౌంటెన్లు సందర్శకులకు విశేషమైన ఆకర్షణ. సిటీహాల్ ప్లాజాకు ఉత్తరాన గల బిసున్‌సిన్ విగ్రహం చూపరులను ఆకట్టుకోకుండా వుండలేదు. 16వ శతాబ్దానికి చెందిన ఈ కొరియా వీరుని నిలువెత్తు విగ్రహం వీరత్వం ఉట్టిపడుతూ ఠీవిగా నిలబడి సందర్శకులను ముఖ్యంగా విదేశీయులను మురిపిస్తూ వుంటుంది.

సియోల్‌లో మ్యూజియంలకు కూడా తక్కువలేదు. 1972వ సంవత్సరంలో నిర్మించిన నేషనల్ మ్యూజియం విజిటర్లు మిస్సవకూడనిది. ఈ మ్యూజియం సమీపంలోనే ఫోక్‌మ్యూజియం అని మరో మ్యూజియం కూడా వుంది. ఇదీ చూడదగ్గదే.

కొత్తపాతల మేలు కలయిక

సియోల్ మార్కెట్లో దొరకని వస్తువులుండవు. కొత్తపాతల మేలుకలయికను సియోల్ మార్కెట్లో చూడవచ్చు. ఒక పక్క పల్లెటూళ్ళ నుంచి బండ్లలో వస్తువులను పట్టుకొచ్చి అమ్ముతున్న గ్రామీణులు మరోపక్క అధునాతమైన పోకడలతో వున్న డిపార్టుమెంటు స్టోరులు. అన్నీ రద్దీగానే వుంటాయి. దక్షిణకొరియా గ్రామీణప్రాంతాలలో ఇప్పటికీ వారానికి ఐదురోజులు సంతలు జరుగుతూనే వుంటాయి. రైతులు కొత్తబట్టలు ధరించి బళ్ళమీద తాము పిండించిన సరుకులను తెచ్చి ఈ సంతలలో విక్రయిస్తూ వుండటం అనాదిగా జరుగుతున్నదే. ఈ నాటికీ ఈ అలవాటు పోలేదు. మొత్తంమీద క్రయవిక్రయాల విషయాలలో సియోల్ మార్కెట్ హాంగ్‌కాంగ్ సింగపూర్‌లతో పోటీ పడుతూనేవుంది.

అధునాతన హోటళ్లు...

సియోల్‌చేరి సౌకర్యంగా బసచేయాలంటే ఏ విధమైన ఇబ్బందీ పడనక్కరలేదు. ఈ నగరంలో అధునాతనమైన హోటళ్లు అనేకం వున్నాయి. హిల్టన్, హ్యాట్ వగైరా హోటళ్లు అధునాతన నగరాలలోని అనేక నక్షత్రాల హోటళ్ళకు ఏ విధంగాను తీసిపోవు. అమితఫాషన్‌బుల్‌గా వుండే మినీ స్కర్టులు మరీ అధునాతన వస్త్రధారణలను కొరియన్లు అంతగా ఇష్టపడరు. రోమ్‌లో వున్నప్పుడు రోమన్‌లాగే వుండాలన్నట్లు కొరియాలో కాలు పెట్టినప్పుడు వారి అభిరుచులనూ మన్నించక తప్పదుకదా? ◆

◆ కార్టూన్ కదంబం





పరాధీనం



◆ కథ

యల్. రాజాగణేష్
సెల్ : 9247433700

య దొక ఆధునిక భవనం. ఆ భవనం ముందు విరబూసిన పువ్వుల మొక్కలు, అటూ ఇటూ పచార్లు చేస్తూ కావలి కాస్తున్న పెద్ద పులిలాంటి ఆల్సేషియన్ డాగ్. ఆ భవనం హుందాన్ని, హుందాతనాన్ని తెలియజేస్తున్నాయి. అదే భవనం పైడాబా మీద పెద్దాయన వాకింగ్ చేస్తున్నారు. అతణ్ణి సమీపించి 'తాతయ్యా!' అని అరిచాడతని మనవడు.

కళ్లజోడు సరిచేసుకుంటూ – 'వార్నీ... తేజా బాబు!' అన్నారాయన.

'ఈ రోజు కాలేజీ లేదట తాతగారూ! మీకు కంపెనీ ఇద్దామనివచ్చాను' అన్నాడు తేజ.

"గుడ్ బాయ్! కింద మన మంగలి సాంబడున్నాడేమో చూడు!".

"లేదు తాతగారూ క్షవరం చెయ్యాలా? గడ్డం గీయాలా? నేను చేస్తాను!"

"వార్నీ! నీకేం కర్మరా? సాంబడొచ్చాడేమో చూడు!" అన్నారు పెద్దాయన.

"అదిగో! మాటల్లోనే వచ్చాడు!" అన్నాడు తేజ.

"ఆలస్యమైపోయింది పెదబాబుగారూ!" అంటూ మంగలి పొది కింద పెట్టాడు సాంబడు. సరంజామా సర్దుకుంటూ తన పనిలో తానున్నాడు.

"సాంబయ్యా! నేను క్షవరం చేస్తానంటే తాతగారు ఒప్పుకోలేదు!" అన్నాడు తేజ. సాంబడు తలెత్తి తేజా వైపు చూసి నవ్వుతూ – 'మీకేం కర్మ బాబూ! బాగా చదూకుని పెద్దుద్యోగం చేస్తారూ...' అన్నాడు సాంబడు.

"సాంబయ్యా! నేను జిమ్ నడుపుతాను! సైమల్టేనియస్‌గా మెన్స్ మెగా బ్యూటీపార్లర్ నడుపుతాను". అన్నాడు తేజా.

"వార్నీ! ఏవిటి తేజా నువ్వంటున్నది? మంగలి షాపు పెడ్తావా?"

అసహ్యంగా ముఖం చిట్లించి స్వరం పెంచి గట్టిగా ప్రశ్నించారు పెద్దాయన.

"ఈ రోజుల్లో అదీ ఇదీ అని లేదు తాతగారూ! అన్నీ వ్యాపారాలే! అందులో సక్సెస్ సాధించడమే! వర్కర్స్‌ని పెట్టుకుని జీతం విసిరేస్తాం! లాభాలు పండించి తీసుకుంటాం! అంతే!" అని చాలా సింపుల్‌గా చెప్పాడు తేజ.

సాంబడు నోరెళ్లబెట్టాడు. ఎందుకంటే – వాడి ఒక్కగానొక్క కొడుకు సురేష్ తేజా తోటే చదువుతున్నాడు. సురేష్‌కి కులవృత్తంటే అవమానం తండ్రి మంగలి పని చేసేవాడని తన ఫ్రెండ్స్‌కి తెలిస్తే సిగ్గరితనం. తేజాకీ తన కొడుకు సురేష్‌కి మధ్యనున్న తేడాని చూసి నోరెళ్లబెట్టాడు సాంబడు. సాంబడికి రమేష్ లేకలేక కలిగాడు. అందుకే వాణ్ణి ఆడింది ఆటగా పాడింది పాటగా పెంచాడు. ఎన్ని ఇబ్బందులెదురైనా వాణ్ణి బాగా చదివించాలని పేరున్న కాన్వెంట్ స్కూల్లో చదివించాడు. వాడికోసం అలుపెరుగని పోరాటం చేస్తూ కాలేజ్‌లో చేర్పించే దాకా ఎంతో కష్టించాడు. కానీ ఇంటర్ పరీక్షల్లో రమేష్ ఫెయిలయ్యాడు. అందుకే చదువుకుంటూ తన పనికి సహాయంగా రమ్మని కొడుకుని పిలిచాడు సాంబడు. రమేష్ ససేమిరా రానన్నాడు. కూలీ పనయినా చేస్తాను కానీ మంగలి పని చెయ్యనని తెగేసి చెప్పాడు. చదువులో ఏకాగ్రత లేదు. పోనీ పన్లో అయినా రాణిస్తాడనుకుంటే అదీ లేదు. ఏం చెయ్యాలో పాలుపోలేదు సాంబడికి.

> " సాంబడు నోరెళ్లబెట్టాడు. ఎందుకంటే - వాడి ఒక్కగానొక్క కొడుకు సురేష్ తేజా తోటే చదువుతున్నాడు. సురేష్‌కి కులవృత్తంటే అవమానం తండ్రి మంగలి పని చేసేవాడని తన ఫ్రెండ్స్‌కి తెలిస్తే సిగ్గరితనం. తేజాకీ తన కొడుకు సురేష్‌కి మధ్యనున్న తేడాని చూసి నోరెళ్లబెట్టాడు సాంబడు. సాంబడికి రమేష్ లేకలేక కలిగాడు. అందుకే వాణ్ణి ఆడింది ఆటగా పాడింది పాటగా పెంచాడు. ఎన్ని ఇబ్బందులెదురైనా వాణ్ణి బాగా చదివించాలని పేరున్న కాన్వెంట్ స్కూల్లో చదివించాడు. "

రెండుదారులూ మూసుకు పోతుంటే తెరుచుకునే దారేదిలో సాంబడికి ప్రశ్నార్థకమై పోయింది.

ఆలోచిస్తూనే పెద్దా యనికి క్షవరం చేసి, గెడ్డానికి సబ్బు నురుగపెడ్తూ – "బాబుగారూ! ఈ నెలజీతం ఇప్పించండయ్యా!" అన్నాడు.

"కింద చిన్నయ్యగారి దగ్గర అడిగి తీసుకో?" అన్నారు పెద్దాయన.

గెడ్డంగీకి, తల మర్దనా చేస్తుంటే –

ఒరేయ్! సాంబా... మరీ గట్టిగా బాదకురా!" అన్నారతను. తలపై మెటికలు చరుస్తూ రుద్దుతుంటే – "సాంబా! నీ కొడుకేం చేస్తున్నాడ్రా? ఈ మధ్యన వాడు రావడం లేదేం?" అన్నాడు.

"ఇంటర్ పోయింది బాబుగారూ! చిన్నయ్యగార్ని ఏదైనా పనిప్పించమని అడగాలండి!" అన్నాడు సాంబడు.

"వేరే పనెందుకురా? నీ పనే నేర్పించు. కులవృత్తికి సాటిలేదు గువ్వలచెన్నా అంటారు కదరా?"

"ఔన్నిజమే బాబూ! గుర్రాన్ని ఏటిగట్టువరకూ తీసుకెళ్లగలం. నీరు తాగించలేము కదా! వాడికి మంగలినంటే అసహ్యమట బాబూ!" అన్నాడు సాంబడు.

"వార్నీ? ఇందులో తప్పేముందిరా? ఆడిసిగతరగా!" అన్నారాయన.

వారంలో రెండు రోజులు ఆ ఇంటికి క్రమం తప్పకుండా వస్తాడు సాంబడు. పెద్దాయనికి చిన్నాయనకి క్షవరం గెడ్డం చేస్తాడు. తల మర్దనా, ఒళ్లు మసాజ్ చేస్తాడు.

నెలకి వెయ్యి రూపాయిలిస్తారు. జీతంకాక దయా ధర్మం కొద్దీ పాతికో పరకా ఎక్కువే ముట్టచెప్పారు. ఇలాంటివి మూడిళ్ల తన చేతిలో ఖాతాలున్నాయి. అదిగాక అదే వీధి సందు మలుపు చివర తనకోబడ్డీ ఉంది. రోజూ షాపులో పని సరే సరి. అదికాక తనకు సన్నాయి వాద్యం వచ్చు. అడపాతడపా పెళ్లిళ్లకి పేరంటాళ్లకి గ్రామదేవతల పడగలకి, చావులిక్కూడా తన జ్యాబ్‌తో వెళ్లి బాండ్ మేళం వాయింది సంపాదిస్తుంటాడు. అలాగే సంపాదించింది జాగ్రత్త చేసి నాలుగ్గదుల ఇల్లుకొన్నాడు. ఇంతవరకూ బాగానే ఉంది. కానీ ఈ మధ్య తన ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణిస్తుంది. కుదురుగా నిల్చుని పట్టుమని పావుగంటయినా పనిచేయలేక పోతున్నాడు. అంతుపట్టని ఆయాసం. మందుల దారి మందులదే రోగం దారి రోగందే అన్నట్టుంది. ఉపశమనమే కానీ నిర్మూలనంలేని రోగమైంది. డాక్టర్ వద్దనడంతో బ్యాండ్ మేళానికి, సన్నాయి వాయించడం పూర్తిగా మానేసాడు. అప్పుడప్పుడూ సన్నాయి వాద్యం తన కొడుకిని కొంచెం కొంచెం నేర్పాడు. ఇన్‌స్ట్రుమెంట్ మీదున్న మోజులో వాడు కూడా శ్రద్ధగా నేర్చాడు. అంతేకాదు పెద్ద పెద్ద వార్లిళ్లకి వెళ్లేప్పుడు సురేష్, స్కూల్ సెలవు రోజుల్లో తీసుకెళ్లేవాడు. బ్లేడు విరిచి చాకుతో బిగించడం, గెడ్డానికి సబ్బు నురుగు రాయడం ఎలా జుత్తు కత్తిరించాలో వంటి పనుల్ని నేర్పించాడు. జుత్తు వత్తుగా దువ్వి ఎక్కువగా ఉన్న వెంట్రుకల్ని క్రమంగా కత్తిరించి సరిచూసుకోవడం కూడా నేర్పాడు. కాస్త పెద్దవాడై కాలేజీలో చేరాక తనతో రావడం మానేసాడు సురేష్. పైగా మంగలి పనిని చీదరించుకోవడం ప్రారంభించాడు. అందుకే చిన్నయ్యగార్నడికి జీతం తీసుకుంటూ – "బాబుగారూ! నా కొడుకు సురేష్‌కి మీ దగ్గర పనుంటే ఇప్పించండి బాబూ!" అని వినయంగా చేతులు కట్టుకుని అడిగాడు. కాస్సేపటి మౌనం తదుపని –

"తేజా సూపర్ బజార్లో ఖాళీ ఉన్నట్టుంది. రేపు తీసుకురా చూద్దాం." అన్నారాయన.

కానీ అదే ఆఖరి రోజు సాంబడు ఆ ఇంటికి మరి రాలేదు. సురేష్ ఉద్యోగం కోసం సూపర్‌బజార్‌కి పోలేదు. శనివారం సాంబడు ఇంటికి రాలేదని వాచ్‌మేన్‌తో ఎంక్వయిరీ చేయిస్తే సాంబడు చనిపోయాడని తెల్సింది.

పదిహేను రోజుల తర్వాత సురేష్ మంగలి పొది పట్టుకుని ఆ ఇంటికి వెళ్లాడు. చిన్నయ్యగార్ని కలిసి – "మా నాన్న చచ్చిపోయాడయ్యా! నన్ను మా కులవృత్తి చేసుకోమని చాలాసార్లు బ్రతిమాలాడాడయ్యగారూ! నేనే విన్లేదు! ఇప్పుడు మా నాన్న మాటను పాటిస్తాను. మీ ఇంట్లో పని యధాప్రకారం చేసుకుంటానయ్యగారూ!" అని గద్గద స్వరంతో ప్రాధేయపడ్డాడు సురేష్. 'సరే' అన్నారు చిన్నయ్యగారు.అంతే! తండ్రి అడుగుజాడల్లో అల్లుకుపోయాడు. తండ్రి నేర్పించిన సన్నాయిని వాయిస్తూ బ్యాచ్‌తో కలిసి వెళ్తున్నాడు. తప్పక కులవృత్తికి వెళ్తున్న సురేష్‌కి చేస్తున్న వృత్తి ఇష్టపడి మాత్రం చెయ్యడం లేదు!

రోడ్డు విస్తరణలో తన మంగలిబడ్డీ తొలగించారు. తగిన షెల్టర్ కోసం ఎంత వెదికినా దొరకలేదు. అద్దె కట్టాలి. కరెంటు కట్టాలి. ఒక పనివాణ్ణి పెట్టుకుని జీతం ఇవ్వాలి. అన్ని లెక్కలూ చేసుకుంటే పెద్ద బొక్క కనిపిస్తుంది. 'ఛత్ గిట్టుబాటు కాదురోరేయ్!' అని మనసు హెచ్చరిస్తుంది. చివరికి మరో షాపులో వర్కర్‌గా చేరాడు సురేష్. ఎంతో గారాబంగా ముద్దు ముద్దుగా పెరిగిన అతను కష్టపడి రాళ్లెత్తే కూలి పనిచెయ్యలేదు. మరో వృత్తి అతనికి తెలీదు. నీడపట్టున బతుకు బండి నడిచే మార్గం కులవృత్తి తప్ప మరోటి లేదు. రోజులు సాదా సీదాగా గడిచిపోతున్నాయ్. సురేష్‌కి పెళ్లయి ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. బతుకు మాత్రం ఎక్కడేసిన గొంగళిలా అక్కడే ఉంది. ఏదో మామూలు మనిషిలా బ్రతకాలి కాబట్టి

"కాస్త పెద్దవాడై కాలేజీలో చేరాక తనతో రావడం మానేసాడు సురేష్. పైగా మంగలి పనిని చీదరించుకోవడం ప్రారంభించాడు. అందుకే చిన్నయ్యగార్నడికి జీతం తీసుకుంటూ - "బాబుగారూ! నా కొడుకు సురేష్‌కి మీ దగ్గర పనుంటే ఇప్పించండి బాబూ!" అని వినయంగా చేతులు కట్టుకుని అడిగాడు. కాస్సేపటి మౌనం తదుపని - "తేజా సూపర్ బజార్లో ఖాళీ ఉన్నట్టుంది. రేపు తీసుకురా చూద్దాం." అన్నారాయన. కానీ అదే ఆఖరి రోజు సాంబడు ఆ ఇంటికి మరి రాలేదు. సురేష్ ఉద్యోగం కోసం సూపర్‌బజార్‌కి పోలేదు. శనివారం సాంబడు ఇంటికి రాలేదని వాచ్‌మేన్‌తో ఎంక్వయిరీ చేయిస్తే సాంబడు చనిపోయాడని తెల్సింది."

అయిష్టంగా బతుకుతున్నాడు సురేష్.

ప్రతి బుధవారం లాగే ఆ రోజూ చిన్నయ్యగారింటికి వెళ్లాడు. కుక్కని చైన్‌తో బంధించి అటూ ఇటూ తిప్పుతున్న తేజా కనిపించాడు. కుక్క తనని చూస్తూ 'భౌ..భౌ...' మనరుస్తోంది. గేటు దగ్గరే నిల్చాడు సురేష్.

"రా! రా!" అన్నాడు తేజా కుక్కని గ్రిల్స్‌కి కట్టేసి.

"తాతగారు నీ కోసమే చూస్తున్నట్టున్నారు. పైకి వెళ్లు" అని మళ్లీ అతనే అన్నాడు.

"అలాగే తేజా!" అన్నాడు సురేష్.

"మరో మాట విను. రేపుదయం పదిగంటలకి తేజా కాంప్లెక్స్‌కి రా. నన్ను కలువు!" అంటూ కుక్కకి బిస్కెట్లు వేస్తున్నాడు తేజా.

పట్టణానికి అతి దగ్గర్లో ఆరెకరాల విస్తీర్ణంలో అధునాతనంగా కట్టబడిన తేజా మల్టీప్లెక్స్ థియేటర్స్, తేజా ఫంక్షన్ హాల్, తేజా సూపర్ షాపింగ్ మాల్, తేజా సూపర్ బజార్, తేజా మోడ్రన్ జిమ్, తేజా మెన్స్ బ్యూటీపార్లర్ అన్నీ ఒకే చోట. ఉదయం మొదలు రాత్రి పది వరకూ ఖాళీ అనేదే ఉండదు.

సమయం సరిగ్గా పదిగంటలు. జనం హడావిడిగా పరుగులు తీస్తూ ఎవరి దోవలో వారు పోతున్నారు. సురేష్ తేజా మెన్స్ బ్యూటీ పార్లర్‌కి వచ్చాడు. లోపలికి ప్రవేశించి దిగ్భ్రాంతికి గురయ్యాడు. విశాలంగా ఉన్న మెన్స్‌బ్యూటీ పార్లర్‌లో చుట్టూ అద్దాలే. అద్దాల్లో ప్రతిబింబాలే! అద్దంలా మెరిసిపోతున్న మొజాయిక్ ఫ్లోరింగ్. మిరుమిట్లు గొలిపే దీపాలకాంతులు. వరుస వరుసగా సెలూన్ చాంబర్లు. ఠీవిగా అందంగా ఉన్న వర్కర్లు, హుందాగా ఉన్న అందమైన రిసెప్షనిస్టు 'తేజా' ఆఫీస్ రూం చూపించి ఫోన్‌లో తేజాకి ఎవరో వచ్చారని చెప్పింది.

లోనికి వచ్చిన సురేష్‌ని చూసి కూర్చోమని సైగ చేశాడు తేజా.

కాస్సేపటి తర్వాత – "హెయిర్ స్టయిల్స్‌లో చాలా రకాలున్నాయ్! ఎన్నున్నాయో చెప్పు!" అన్నాడు తేజా.

తనకి తెలీదని పెదవి విరిచాడు సురేష్.

"తెలీదు కదూ! క్షవరం చెయ్యడం, గెడ్డం గీయడం అంతే తెల్సు! ఔనా?" అని మళ్లీ తనే "హెయిర్ స్టయిల్స్‌లో ట్రెండీ లుక్, క్లాసిక్ లుక్, ట్రెడిషనల్ లుక్ అని మూడు రకాలున్నాయి. ట్రెండీ లుక్‌ఓ స్పైక్, మంకీ హెయిర్ కట్ ఇంకా క్రియేటివ్ కటింగ్ అనే రకాలున్నాయి. నీకు తెలిసిన వృత్తి విద్య కేవలం ప్రొఫెషనల్‌గా ఉద్యోగాలు చేసుకునే వారికీ, సామాన్యునికి పనికొస్తుంది. ప్రస్తుత ట్రెండ్ ఫాలో అయ్యే యూత్‌కి పనికొచ్చే స్పైక్స్, మెస్సీ ఇంకా హనీసింగ్ హెయిర్ స్టయిల్స్ చేసే అతణ్ణి ముంబై నుండి రప్పించాను. ఈ రోజు నుంచే మిస్టర్ కాంగో దగ్గర వర్క్ నేర్చుకో! ట్రైనింగ్‌లో బాగా శ్రమించి నేర్చుకో! తేజా మెన్స్ బ్యూటీ పార్లర్, పేరు ప్రతిష్టా పెరిగేలా ప్రవర్తించు! నీ జీతం పదివేలు!" అన్నాడు తేజా. సురేష్ ముఖం ఆనందంతో వెలిగిపోతుంది. ఎదురుగా ఉన్న అద్దంలో పరాధీనమైన తన కులవృత్తి ప్రతిబింబం వికృతంగా నవ్వుతోంది.

"నువ్వు వర్కర్‌వి. నన్ను తేజా అని పేరుపెట్టి పిలవకూడదు! తెల్సా!" అన్నాడు తేజా.

"అలాగే లే... అలాగే సార్!" అని తలూపాడు సురేష్.

■

వడలు వెరైటీగా...

కంద వడలు



కావలసిన పదార్థాలు

కంద : అర కిలో
పెసరపప్పు : 150 గ్రా.
ఉల్లిపాయలు (పెద్దవి) : 5
అల్లం : చిన్నముక్క
పచ్చిమిర్చి : 10
జీలకర్ర : 1 చెంచా
ఉప్పు : తగినంత
నూనె : పావుకిలో

తయారీ విధానం

పెసరపప్పును గంటసేపు నానబెట్టాలి. కందను చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. పెసరపప్పు, కంద, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు కలిపి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఉల్లిపాయలు సన్నగా తరిగి ఈ ముద్దలో కలపాలి. స్టవ్‌మీద నూనె పెట్టి కాగనివ్వాలి. పిండిని వడలుగా చేతి మీద ఒత్తుకుని నూనెలో వేసి దోరగా వేయించాలి. ఇవి చిరుతిండిగానే కాక అన్నంతో తినడానికి కూడా బావుంటాయి.

ఆలూ వడ

కావలసిన పదార్థాలు

బంగాళదుంపలు : అరకిలో
వెల్లుల్లి రేకులు : 4
అల్లం : చిన్నముక్క
పచ్చిమిర్చి : 2
ఆవాలు, జీలకర్ర : 1 చెంచా
కొత్తిమీర, కరివేపాకు : కొద్దిగా
వంటసోడా, పసుపు : చిటికెడు
ఉప్పు, నూనె : తగినంత

వడలోకి కావలసినవి

శనగపిండి : ఒకటిన్నర కప్పు
గోధుమపిండి : అరకప్పు
జీలకర్ర పొడి, కారం : చిటికెడు
కొత్తిమీర, ఉప్పు : తగినంత

తయారీ విధానం

బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడకబెట్టాలి. తరువాత తొక్కతీసి పెద్ద పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. కొద్దిగా నూనెను వేడిచేసి ఆవాలు, జీలకర్ర పొడి, కరివేపాకు, పసుపు వేయాలి. రంగు మారిన తరువాత బంగాళదుంప ముక్కలు, ఉప్పు కూడా వేయాలి. రెండు నిమిషాలు వేగనిచ్చి గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని కూడా వేయాలి. ఐదు నిమిషాల తరువాత దించేసుకుని ఆ మిశ్రమాన్ని చల్లారబెట్టాలి. ఒక గిన్నెలోకి శనగపిండి, గోధుమపిండి, జీలకర్ర, ఉప్పు, కారం వంటసోడా వేసి కొద్దిగా నీరు చేర్చి చపాతీ పిండిలా కలుపు కోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని చపాతీలా ఒత్తుకోవాలి. తరువాత కొద్దిగా మిశ్రమాన్ని చపాతీలో పెట్టి అన్ని వైపుల నుండి మూసేసి వడలా వెడల్పుగా ఒత్తుకోవాలి. వీటిని నూనెలో వేయించాలి.

బీన్స్ వడలు



కావలసిన పదార్థాలు

బీన్స్ : 2 కప్పులు, ఉల్లిపాయ : 1, పచ్చిమిర్చి : 1, కొత్తిమీర, కరివేపాకు: 1 కట్ట, 1రెమ్మ, అల్లం, వెల్లుల్లిపేస్ట్: 1 చెంచా, ఉప్పు, నూనె : తగినంత

తయారీ విధానం : బీన్స్‌ను నాలుగైదు గంటలపాటు నానబెట్టాలి. తరువాత నీళ్లు ఒంపేసి గ్రైండర్‌లో వేసి కొద్దిగా నీళ్లు జతచేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమంలో ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఉప్పు వేసి బాగా కలపాలి. కావాలనుకుంటే అరచెంచా గరం మసాలా పొడి కూడా వేసుకోవచ్చు. దీనిని ఉండలుగా చేసుకుని వెడల్పుగా ఒత్తుకోవాలి. వీటిని నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.

సగ్గుబియ్యం వడలు

కావలసిన పదార్థాలు :సగ్గుబియ్యం :1 కప్పు, వేరుశనగపొడి :1/2 కప్పు, బంగాళదుంప :1, పచ్చిమిర్చి :7, ఉప్పు, నూనె : తగినంత

తయారీ విధానం : సగ్గుబియ్యాన్ని శుభ్రంగా కడిగి మూడు గంటలపాటు నానబెట్టి ఉంచాలి. బంగాళదుంప ఉడికించి తొక్క తీసి మెత్తగా చిదిమి పక్కన పెట్టుకోవాలి. నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నిటినీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని వడల్లా వెడల్పుగా ఒత్తుకోవాలి. వీటిని ఎరుపు రంగు వచ్చే వరకూ నూనెలో వేయించాలి. ఇవి వేరుశనగ చట్నీతో బాగుంటాయి.

బాబోయ్... బ్రష్షే!



మామూలుగా బొమ్మలేసే బ్రష్ ఎంతుంటుందండీ! మనం రాసుకునే పెన్నంత వుంటుంది. కానీ మీరు చూస్తున్న బడా బ్రష్ ఎంత పొడవుంటుం దంటారు?! అలా చెప్పడం కష్టమేనా! పోనీ మమ్మల్ని చెప్పమంటారా! 12 అడుగుల పొడవుంటుంది. 'ఇంతకీ దీన్ని తయారుచేసిన ఘరానా వ్యక్తి ఎవరో?' అనుకుం టున్నారా? దాన్ని హి వెంజున్ అనే ఆర్టిస్టు రూపొందించాడు. అందుకోసం 300 గుర్రాల తోకల నుంచి వెంట్రుకలు సేకరించాడు. తనే సొంతగా చేసేశాడు. అంతేకాదం డోయ్! ఈ మధ్యే ఓసారి ప్రత్యేకంగా ఎగ్జిబిషన్ పెట్టి మరీ బడా బ్రష్షును ప్రదర్శించాడు. అంత టితో ఆగక ఆ బ్రష్షుతో ఆర్ట్ కూడా వేసేశాడు. అలా ఆ పొడవాటి బ్రష్షుతోనే గిన్నిస్ రికార్డులకు ఎక్కేశాడు.

నీళ్లల్లో పోటీ

విదేశాలలో విచిత్రమై పోటీలు పెడుతుంటారు. అయితే అందులోకూడా ఎప్పుడూ ఏదో ఒక కొత్త ఒరవడిని సృష్టించి అందరినీ అబ్బురపరచాలని తాపత్రయ పడుతుంటారు. రాళ్లపైనా, చెక్కలపైనా, కూరగాయలపైనా, బియ్యపు గింజలపైనా చిత్రాలను చెక్కడం మనకు తెలుసు. అయితే ఈ పోటీలు గుమ్మడికాయలపైప చిత్రాలను చెక్కడం. అందులో కొత్తదనం ఏముందనకుంటున్నారా? నీళ్ల అడుగు భాగాన గుమ్మడికాయ మీద చిత్రాలను చెక్కాలి. ఫ్లోరిడాలో ఇటీవల ఈ విచిత్రమైన పోటీని నిర్వహించారు. వీటిని ప్రతి సంవత్సరం హాలోవీన్‌కు ముందు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనాలంటే గజఈతగాళ్లై ఉండాలి మరి.

◆ వింతలోకం

కాయ కాదు ...బాతు

ప్రకృతి వింతలు ఎన్నో! మార్లిన్, లియోనెల్ పాట్రిడ్జ్ పెంచిన కూరగాయల తోటలో బాతు ఆకారంలో ఒక కాయ కాసింది. అది ఎలా ఉందంటే ఒక బాతు మెడ వెనుక్కు తిప్పి చూస్తున్నట్టుగా ఉంది. దానికి కన్ను, ముక్కు చాలా స్పష్టంగా నిజమైన బాతుకు మాదిరిగానే ఉన్నాయి. 'నేను నలభై సంవత్సరాలుగా కూరగాయలు పండిస్తున్నాను. ఇప్పటి వరకూ జంతువుల ఆకారంలో ఉన్న కూరగాయలను చూడలేదు' పాట్రిడ్జ్ అంటున్నాడు. మొదట్లో ఆయన దాన్ని చూడగానే ఏంటో అనుకున్నాడట. కాసేపటకిగానీ పోల్చుకోకపోయాడు. 'నేను దాన్ని చూడగానే ఒక్కసారి పెద్దగా నవ్వాను. దాని కోసం మేం ఏమీ చేయలేదు. ఇది పూర్తిగా సహజమైంది. ఇది బాతు ఆకారకంలో తల వెనుకకు తిరిగి ఉంది. దాన్ని మేం తినం. ఎందుకంటే ఇది చాలా ఆరాధ్యనీయంగా ఉంది' అని ఆయన చెప్తున్నారు. ఆయన కూతురు సోఫి(2) దాన్ని చాలా ఇష్టపడుతుంది. 'బాతు, బాతు' అంటూ కేరింతలు పెడుతోంది. దీన్ని చూసిన వారు మాత్రం అదలా పెరగడానికి వీళ్లే ఏదో చేశారనుకుంటున్నారట. ప్రకృతి ఎంత మాయ చేసిందో!

చాక్లెట్ స్నానం

చాక్లెట్ తింటుంటే ఎలా వుం టుందీ! ఎక్కడికో వెళ్లిపోతాం!! అదే చాక్లెట్‌తో స్నానం చేస్తే ఎలా వుంటుందీ? అన్న ఆలోచన వచ్చింది ఓ బుద్ధిశాలికి. అంతే... చాక్లెట్ బాత్‌కి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఎక్కడో కాదు! జపాన్‌లోని టోక్యో నగరంలోనే. ఆ ఘనతంతా ఓ రిసార్టువారు కొట్టేశార్లెండి. నీళ్లలో చాకో, బాత్ పౌడర్లు వేసి కలుపుతారు. ఆ నీటిని చాక్లెట్ బాత్ చేయాలనుకున్న వారి మీద పోస్తారు. ఇది మనమంతకు ముందు చెప్పుకున్న బీరు స్నానం లాంటిదే. కాకపోతే వాలెంటైన్స్ డే సందర్భాంగా ప్రేమ పావురాలకు మాత్రమే ఈ సౌకర్యం. అంతేకాదండోయ్! ఈ రిసార్ట్‌లో... చాక్లెట్ స్నానమే కాదు వైన్ బాత్, గ్రీన్ టీ బాత్, కాఫీ బాత్ కూడా చేసేయొచ్చు. కాకపోతే దానికి తగ్గ బిల్లుకూడా మన చేతిలో పెడతార్లెండి!

◆ కవిత్వమ్

బాల్యం బందిఖానా

కౌమారం యవ్వనం వృద్ధాప్యం
మూడు దశలకే బతుకు పరిమితం
బాల్యం కనుమరుగైంది
చదువు బాధ్యతైంది
మోయలేని బరువైంది
కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకంటూ
నెల తప్పిన తల్లి కార్పొరేట్ స్కూలుకు
పరుగులు
కప్పం కట్టబడుతుంది
కడుపులో బిడ్డ స్కూల్లో చేర్చబడుతుంది
నెలలు మోస్తున్న తల్లుల నెలవారీ లెక్కలు
కంప్యూటర్లలో నిక్షిప్తం!
బాల్యం మాటరాని మూగతనం
దృశ్యం గుర్తించని చూపు
వస్తువు తెలియని వర్తనం
శబ్దం గ్రహించని గ్రహణం
ఆకలైతే ఏడ్పు
లాలిస్తే నవ్వు
జోకొడితే నిద్ర!
అందాల బాల్యం మాయాలోకమైంది
ఆటపాటల దశ బందిఖానా అయింది
పలక తెలియదు బలపం తెలియదు
పెన్సిలు తెలియదు పేపరు తెలియదు
కుర్చీ తెలియదు బల్ల తెలియదు
బాల్యానికి అన్నీ ఆటవస్తువులే
గోలీలు బొంగరాలు
బిళ్ళంగోడు గాలిపటాలు
కోతి కొమ్మచ్చిలు తొక్కుడు బిళ్ళలు
బాల్యదశ భోగ భాగ్యాలు
అమ్మ చనుబాల తీపిదనాలు
అత్తవొడి పూల మెత్తదనాలు
తాతయ్య భుజాలపై విహసితాలు
గూడుకట్టని అనుభవాలు
నెమరుకు అందని అనుభూతులు!
టాగూర్ ఎక్కడ ఎల్‌కేజి చదివాడు
కట్టమంచి ఎక్కడ డేకేర్‌లో
వున్నాడు
సర్వేపల్లి ఎక్కడ యుకేజి చదివాడు
గురజాడ ఎక్కడ నర్సరీలో చేరాడు
మొగ్గవిచ్చుకునే దాకా గూటికి
పరిమితం
పక్షి మెదడు పాకాన పడేదాకా
బిడ్డ బడి ప్రవేశానికి హద్దుగా
ఐదేళ్ళ లక్ష్మణ రేఖలు
ఏ నేల మాళిగల్లో దాగాయి?

- అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ : 9848252946

అస్తమించని అరుణోదయం

నీలి నెట్ నిన్ను...నీ పురైను జుర్రేసినాక
జీవితవం స్థానే జరత్వం ఆక్రమించింది...
యాభై నక్షత్రాల జెండా వాడు ... దేహాన్ని, దేశాల్ని 'సాయం'
'స్వేచ్ఛ', 'ప్రజాస్వామ్యం' అనే ఎర మాటున ఆంక్షల బుట్టలో
బందీ చేసె!
మత్స్య న్యాయం పుడమంతా పడగలెత్తింది...
వీధి గుమ్మాలు, కిటికీలు దాటి నీ నట్టింట... పడకటింట...
పాశ్చాత్య విష సంస్కృతి జొరబడింది అచ్చోసిన ఆంబోతులా!!
పెత్తందార్ల దోపిడి పహారా మధ్య పేద జన జీవనం...
ప్రజాస్వామ్య భారతికే దు:ఖ భాజనం...
ఆధార్ ఆసరా అంటూ నీ ప్రైవసీకే ఎసరు పెట్టింది రాజ్య తంత్రం
అంగ బలం, అర్థ బలం, అధికార బలం, మంద బలం, మంది
బలం
పెకలిస్తూ మొలకెత్తే విత్తే జన చైతన్యం... అది తెస్తుంది జనతా
ప్రజాతంత్రం
సాఫ్ట్‌వేర్ శంకర్, హార్డ్ వేర్ హరీష్, గుడిసెలోని గౌరమ్మ! అడ్డా
మీది అంజన్నకు ఆకలే ... ఎజెండా అయినవేళ ... సమరమే
శ్రీకారం!
గాయపడ్డ గుండెలకు ... రక్తం అంగినే... జెండాగా మారుతుంది
అందరికీ ఆకలే... ఎజెండా అయినాక! శాంతి మంత్రం ఫలించదు
90 మందిపై పది మంది సాగించే దోపిడీ దౌర్జన్యం.. పలాయన
చిత్తగింపే!
అస్తమయం తెలియని అరుణోదయం నిత్య ప్రగతి రథం!

-తంగిరాల చక్రవర్తి, 9393804472

నవ్వుల్ – పువ్వుల్

చీకట్లో బొమ్మ

సతీష్ – నేను చీకట్లో పిల్లి బొమ్మను గీసాను...!

చరణ్ – చీకట్లో ఎలా గీయగలిగావ్...?

సతీష్ – నాకు కనిపిస్తేగా...! చెప్పడానికి...!

ప్లాస్టిక్

డాక్టర్ – మీరు మూడు పూటలా ఐరన్ టాబ్లెట్స్ వాడాలి...!

పేషెంట్ – ఐరన్ టాబ్లెట్స్ అరుగుతాయో లేదో ప్లాస్టిక్ టాబ్లెట్లయితే బెటరేమో సార్...!

పేరు

సుబ్బారావు – నేను సీరియల్ ఆఖరి భాగం చూసి మొత్తం సీరియల్ అంతా చెప్పేగలను...!

వెంకట్రావు - ఓస్... అంతేనా, నేనయితే సీరియల్ పేరును చూసే, మొత్తం కథంతా చెప్పేయగలను...!



ఫీజు

పోలీస్ - మీరు లాయర్ అయివుండీ ఆ దొంగ ఇంటికి దొంగతనానికి వెళ్లడం ఏమిటీ...?

లాయర్ - నేను ఆ దొంగ కేసు వాదించాను. కానీ నా ఫీజు ఇవ్వకుండా ఎగ్గొట్టాడు... ఏం చేయను మరి...!

రాంగ్ నెంబర్

రాజు - హలో మీరు చేసినది రాంగ్ నంబర్‌కండీ...!

శశి - అయితే కరెక్ట్ నంబర్ చెప్పరా తింగరోడా...!

ఓవర్

రాజీవ్ - ఆవిడ అంత ఓవర్‌గా మేకప్ చేసుకునా వచ్చిందేమిట్రా...?

శశాంత్ - ఆమె బ్యూటీషియన్ అని అందరికీ తెలియడానికట...!



అంకితం

ముకుందం - మీరు ఈ కథను నాకే ఎందు అంకితమిస్తానంటున్నారు...!

పరాంకుశం - ఇంత చెత్త కథను చదివే ఓపిక ఇంకెవరికీ వుండదని...!



దొంగలా

అభి - నువ్వెప్పుడూ కుక్కలా నావెంటే తిరుగుతావేం...?

శశి - నువ్వు దొంగలా కనబడతావు కనుక...?



చూయింగ్ గమ్

టీచర్ - నీవు చూయింగ్ గమ్ నములుతున్నావు కదూ...!

చరణ్ - మీకుగాని కొంచెం కావాలా టీచర్...!

మార్కులు

తండ్రి - ఎప్పుడూ తక్కువ మార్కులే వస్తున్నాయేమిట్రా...?

చరణ్ - మొన్నామధ్య ఎక్కువ వస్తే కొన్ని మా ఫ్రెండ్‌కి ఇచ్చేసా డాడీ...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

భారతీయ నాట్యాల సమ్మేళనం కోణార్క్ నృత్యోత్సవం

కోణార్క్ నృత్యోత్సవం ప్రతి సంవత్సరం కోణార్క్ సూర్య దేవాలయంలో బహిరంగ నృత్య ప్రదర్శనశాలలో జరుగుతుంది. ఈ నృత్యోత్సవం మూడు నుంచి ఏడు రోజులపాటు నిర్వహించబడుతుంది. సాధారణంగా ఈ ఉత్సవం డిసెంబర్ నెలలో భారీ స్థాయిలో జరుగుతుంది. ప్రతి సంవత్సరం ఈ సమయంలో దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు భారతీయ సంప్రదాయ రీతుల్ని చూడటానికి కోణార్క్‌కు చేరుతుంటారు. దేశం నలుమూలల నుంచి సుప్రసిద్ధులైన నాట్య కళాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తూ ఈ ఉత్సవంలో భాగం పంచుకుంటారు. కళాపిపాసులైన ప్రేక్షకులకు పలు రకాల శాస్త్రీయ నృత్యరీతులను ఒకే వేదికపై వీక్షించగలిగే అవకాశాన్ని ఈ ఉత్సవం కల్పిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం అన్నట్లు ఈ వేదికపై అన్ని నాట్య రీతులూ కలిసి సర్వం నాట్యమయమని, కేవలం 'నాట్యం' అనే ఒకే ఒక్క భావాన్ని కలిగిస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

కోణార్క్ సూర్యదేవాలయాన్ని బ్లాక్ పగోడా అని కూడా పిలుస్తారు. 13వ శతాబ్ది అర్ధభాగంలో గంగ సామ్రాజ్య ప్రభువు మొదటి నరసింగదేవుడు ఈ ఆలయాన్ని నిర్మించాడు. కళాత్మకతకు ఈ దేవాలయం చిరునామాగా చెప్పవచ్చు. ఈ దేవాలయం నిర్మాణ క్రమం నిజంగా విలక్షణంగా, విశిష్టమైనదిగా ప్రత్యేకత కలిగి ఉంది. ఏడు గుర్రాలు లాగుతున్నట్లుగా రథం ఆకారంలో సూర్యదేవునికి అంకిత భావంతో నిర్మించబడిన దేవాలయం. మరమ్మతులలో భాగంగా ఈ దేవాలయం ఎన్నో మార్పులకు గురైనప్పటికీ, నాటి కళాత్మకతలు సాక్షీభూతంగా మిగిలిన ఈ ఆలయం ఇప్పటికీ సామాన్య ప్రజను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. మొట్టమొదటి నాట్యోత్సవం 1989వ సంవత్సరంలో నిర్వహించబడింది. ఒడిషా రాష్ట్రాన్ని ఓ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం అన్ని శాస్త్రీయ నృత్యరీతుల్ని ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి కోణార్క్‌లోని బహిరంగ ప్రదర్శనశాలలో ప్రదర్శించటం జరుగుతోంది. ఈ సంరంభం ఒడిషా డాన్స్ అకాడమీ, ఈస్టర్న్ జోనల్ కల్చరల్ సెంటర్, కోల్‌కతా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

భారతదేశం భిన్న కులాలు, మతాలు, సంస్కృతులు, కళలకు పుట్టినిల్లు. జనపద కళలు మొదలుకొని శాస్త్రీయ కళారీతుల వరకు ప్రతి ఒక్కటీ దేనికదే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, మోహినీ అట్టం, మణిపురి, ఒడిస్సీ మొదలగునవి భారతీయ శాస్త్రీయ నృత్య రీతులుగా చెప్పబడుతున్నాయి. ఇవి దేశంలో వేర్వేరు ప్రాంతాలకు సంబంధించినవి. ఇక జానపద నృత్యాలు లెక్కలేనన్ని. అయితే ఈ శాస్త్రీయ నృత్య రీతులు అన్నింటినీ ఒకే వేదికపై చూసే అవకాశం లభిస్తే, సహృదయ ప్రేక్షకుడికి ఎలాంటి అనుభూతి లభిస్తుందో వేరే చెప్పనవసరం లేదు. అది కూడా సంవత్సరంలో ఒక ప్రత్యేక సందర్భంలో ఓ పండుగలా నిర్వహిస్తే, ఆ పండుగకు తోడు మరికొన్ని ఆసక్తికరమైన అంశాలు అందులో భాగమైతే... ఆహాఁ! వినటానికే ఎంతో హాయిగా అన్పిస్తుంది. సరిగ్గా ఇలాగే ప్రతీ సంవత్సరం కోణార్క్ నృత్యోత్సవం పేరుతో సూర్యదేవాలయంలో నృత్య కళార్చన జరుగుతోంది. ఈ విషయం తెలియని కళారాధకులు లేరు అనటంలో అతిశయోక్తి లేదు. కళలకు ఎల్లలు లేవు అన్నది ఎంత నిజమో ప్రతి సంవత్సరం ఈ నృత్యోత్సవం తిలకించటానికి వచ్చే విదేశీయులను చూస్తే తెలుస్తుంది. ఈ కోణార్క్ నృత్యోత్సవానికి సంబంధించిన అంశాలను తెలుసుకుందాం.

ఎంతోమంది నాట్యప్రియులు చాలా ఆసక్తిగా ఎదురుచూసే పండుగ ఈ కోణార్క్ నృత్యోత్సవం. ఈ ఉత్సవంలో ప్రధానంగా ఒడిస్సీ, భరతనాట్యం, మణిపురి, కథక్ వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలే కాకుండా ఛావ్ వంటి గిరిజన నృత్యాలను కూడా వెలుగులోకి తీసుకువచ్చే వేదిక అవుతుంది. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే కొత్త నాట్యరీతులు ఈ వేదిక ద్వారా ప్రాధాన్యత సంతరించుకోవటమే.

సూర్యదేవాలయం దాదాపు 700 సంవత్సరాలకు పూర్వం నిర్మించబడింది. అంటే ఈ నాట్యోత్సవాలు జరిగే నాట్యమంటపం కూడా అంతే పురాతనమైనది. సంవత్సరం పొడవునా పర్యాటకులను ఆకర్షించటంతో దీనిని ప్రపంచంలోని వారసత్వ ప్రదేశాలలో ఒకటిగా యునెస్కో ప్రకటించింది. ఏదేమైనప్పటికీ సంవత్సరమంతా పర్యటన కోసం వచ్చే వారి సంఖ్యకు కేవలం ఈ నాట్యోత్సవాల్లో నిష్ణాతుల ప్రదర్శనలు తిలకించటం కోసం కళారాధకులుగా వచ్చే వారి సంఖ్య ఎంత మాత్రమూ తీసిపోదు. మండప నేపథ్యంలో నిలిపిన ప్రాచీన శిల్పాలతో పోటాపోటీగా అందమైన భంగిమలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే నర్తకుల కళాచాతుర్యమే దీనికి కారణం.

ఈ ఉత్సవాలలో కేవలం నాట్య ప్రదర్శనమే కాదు, క్రాఫ్ట్ మేళా, ఫుడ్ మేళా కూడా జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ సాంప్రదాయిక వంటకాలతోపాటుగా చేతివృత్తుల కళా నైపుణ్యాన్ని కూడా ఆస్వాదించవచ్చు. చంద్రబాఘ బీచ్ దగ్గర 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ ఆలయం ప్రతి అణువులోనూ కళా నైపుణ్యం ఉట్టిపడుతూ గతించిన వైభవాన్ని స్ఫురణకు తెస్తుంది. అటువంటి వాతావరణంలో నాట్యం, కళలు, పర్యటన అన్నీ కలిసి ఒక మరపురాని మధురానుభూతిని కలిగిస్తాయి.



మొట్టమొదటి కోణార్క్ నాట్యోత్సవం 1989లో జరిగింది. చల్లని సాయం సమయంలో డిసెంబర్ మాసంలో ప్రముఖ నాట్యగురువులు తమ శిష్య బృందంతో కలిసి అద్భుతమైన నాటకీయతతో నృత్య దర్శకత్వంలో మలచిన వివిధ అంశాలను కనులకు ఇంపుగా ప్రదర్శిస్తారు. మొదట్లో ఈ ఉత్సవం మూడు రోజులపాటు జరిగేది. కానీ కళాప్రియుల సంఖ్య పెరిగిపోతున్న క్రమం బట్టి ఈ ఉత్సవాన్ని ఐదురోజులపాటు నిర్వహిస్తున్నారు. కేవలం నాట్య ప్రదర్శనలే కాకుండా ఒరియా దేవాలయ శిల్పాలు, సైకతశిల్ప ప్రదర్శన కూడా మరో అదనపు ఆకర్షణ. వివిధ శాస్త్రీయ నృత్యాలలో ఉద్దండులు దేశం నలుమూలల నుంచి ఈ ఉత్సవాలను తిలకించటానికి ప్రతి సంవత్సరం వస్తుంటారు.

నాట్యమంటపం ఇరుప్రక్కలా ఉగ్రరూపంలో ఉన్న రెండు సింహాలు, మనిషి ముందు వక్రతుండాలతో నిలిచిన గజరాజులు మంటప పైభాగంలో నిలిచి సహృదయ ప్రేక్షకులను ఆహ్వానిస్తున్నట్లుగా ఉంటాయి. ఇక్కడ సింహాలను శక్తికి, గజరాజులను సంపదకు, మానవ శిల్పాలు న్యాయానికి ప్రతీకలుగా చేస్తారు. నాట్య మందిరం గోడలన్నీ దేవతలు, దివ్యపురుషులు, నాట్యకారులు, సంగీతకారులు, ప్రేమికులు, యుద్ధ దృశ్యాలతో చాలా అందంగా చెక్కబడి ఉంటాయి.

ఇక్కడి హస్తకళల ప్రదర్శనను 1991వ సంవత్సరం నుంచి రాష్ట్ర పారిశ్రామిక విభాగం వారు నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనల్లో భాగంగా గ్రామీణ హస్తకళలు, కుండలు (పాటరీ), అధునాతన కళాత్మకతను జోడించి మలచిన వస్తువులు మొదలైనవి కనువిందు చేస్తాయి.

కోణార్క్ నృత్యోత్సవాల గురించి మాట్లాడుకునే ముందు, తప్పనిసరిగా ఒక వ్యక్తిని గురించి ప్రస్తావించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆయనే గురు గంగాధర్ ప్రధాన్. 1986లో కోణార్క్ నాట్య మండప నిర్మాణం ద్వారా ఒడిషాలో నూతన చరిత్రనే సృష్టించారనటంలో ఏమాత్రం సందేహం లేదు. భారతీయ 'గురుకుల పరంపర'ను ప్రతిబింబించే ఈ స్థానం ఒడిషా కళలు, సంప్రదాయాలకు గర్భగుడిగా వెలుగొందుతోంది.

- సింహాద్రి నాగశిరీష

అర్కా విహార్

సూర్య దేవాలయానికి దగ్గరలో ఎన్నో ప్రయాసలకోర్చి గురుశ్రీ ప్రధాన్ అర్కావిహార్ స్థాపించారు. ఇక్కడ ప్రతిరోజూ గోటిపువ, ఒడిస్సీ నృత్యం, మర్దల్, తబలా, ఒడిస్సీ సంగీతం మొదలైన అంశాలలో శిక్షణనిస్తారు. విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించటానికి మూడు దశలలో అవకాశం ఉంది. ప్రాచీన కళారూపాలైన సంకీర్తన, పైకా అఖీడా, పాలా, దీస్‌ఖితియా, రామ్‌లీలా మొదలగువాటిని బసంత్ పంచమి. ఝూలాపూర్ణిమ వంటి వివిధ సందర్భాలలో ప్రదర్శిస్తారు.

ఒడిషా సంప్రదాయిక కళలకు ప్రాముఖ్యాన్ని, ప్రాచుర్యాన్ని కల్పించటమే దీని ముఖ్య ఉద్దేశం. పూరీలోని పరికుల్‌లో 1992లో చంద్రశేఖర్ కళామందిరం నిర్మించబడింది. ఇక్కడ విద్యార్థులకు గోటిపువ, ఒడిస్సీలలో శిక్షణనిస్తారు.

గురుశ్రీ ప్రధాన్ ఒకరకంగా సాంస్కృతిక విప్లవాన్నే తీసుకువచ్చారని ఒక్కమాటలో చెప్పవచ్చు. ఖజురహో నృత్యోత్సవాన్ని ప్రేరణగా తీసుకొని గురు గంగాధర్ ప్రధాన్ ఈ సాంస్కృతిక ఉత్సవాల ఆరంభానికి నాందీ పలికారు. కోణార్క్‌లోని అర్కావిహార్‌లో కోణార్క్ సంగీత నృత్యోత్సవాలు 1986 నుంచి ఆరంభమయ్యాయి. వాటి ఆరంభమే నేడు అంతర్జాతీయ పండుగగా ఎంతోమంది కళాకారులకు, సంగీత నృత్యకారులకు, పండితులకు అంతర్జాతీయంగా వేదిక అయింది.

చావి రజావత్

◆ ప్రత్యేకం

ఆ అయిదుగురు...

సర్పంచ్ అనగానే....గుబురు మీసాలు, కుడి చేత్తో కర్ర, ఎడమ చేత్తో భుజం మీది పైపంచె సవరించుకునే నడి వయసు పెద్ద మనిషి రూపం స్ఫురణకు వస్తుంది. అందుకు భిన్నమైన ఆలోచనే రాదు మనకు. అయితే ఐదుగురు మహిళలు సర్పంచులుగా తమ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న వైనం ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేస్తోంది. ఒరిస్సా, గుజరాత్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఆర్తి దేవి, మీనా బెహెన్, చావి రజావత్, సుష్మా భదు, రాధా దేవి... విజయగాథలు తెలుసుకుందాం.

ప్రజా పంపిణీ విధానాన్ని తన గ్రామానికి పరిచయం చేసిన ఘనత ఆర్తి దేవిదే. ఒరిస్సాలోని 'గంజాం' గ్రామ సర్పంచ్ ఆమె. నిజం చెప్పుకోవాలంటే ఆ గ్రామస్తులకు ప్రజా పంపిణీ గురించి కూడా పెద్దగా తెలియదు. అలాంటిది ఆర్తి సర్పంచ్ అయ్యాక .... అక్కడ పెట్టిన చవక దుకాణాల వల్ల గ్రామస్తులకు కిరోసిన్, గోధుమలే కాక మరికొన్ని నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరలకు అందుతున్నాయి. మహిళల కోసం అక్షరాస్యతా కార్యక్రమాన్ని సైతం చేపట్టింది ఆర్తి. వేలి ముద్రల నుంచి సంతకాలు చేసే స్థాయికి చేరుకున్నారు. ఎం.బి.ఎ పట్టా పుచ్చుకున్న ఆర్తి ... ఆ పల్లెలో వుంటూ... నిరక్షరాస్యుల కోసం పని చేయడమంటే మాటలా!

గుజరాత్‌లోని వైరా జిల్లాలోని ఓ చిన్ని గ్రామం అది. పితృస్వామ్య భావజాలం బాగా పాతుకు పోయిన పల్లె కూడా. అలాంటిచోట ఓ మహిళ సర్పంచ్‌గా ఎన్నిక కావడం అంత సులభం కాదు. అలాంటి చోట చరిత్రను సృష్టించిన తొలి మహిళ మీనా బెహెన్. పంచాయతీ సభ్యులందరూ మహిళలే కావడం మరో ప్రత్యేకత. 'ఎప్పుడూ మగవాళ్లే పెత్తనం చేస్తున్నారు. ఆడవాళ్లు ఎన్నడూ నాయకత్వం స్థానంలో లేరు. మొదట మమ్మల్ని కూడా వేలెత్తి చూపించారు. అలాంటి మహిళలే ఇవాళ తమ సమస్యలను మా దగ్గర చెప్తున్నారు' అంటోంది మీనా. స్వయం సహాయక బృందాల్లో వుండడంతో నాయకత్వ లక్షణాలను అలవరచుకోగలిగామన్నది మీనా మనసులో మాట. అధికశాతం గ్రామస్తులకు ప్రభుత్వ పథకాల గురించి పూర్తిగా తెలీదు. ఈ ఏడాది పేదలకు ఇళ్ల నిర్మాణం పథకం కింద గ్రామంలో ముప్పై ఇళ్లు కట్టించారు. ఇప్పటి వరకు సరైన రోడ్డు లేక గర్భిణులు పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు. వారికి ఆసుపత్రులకు వెళ్లడానికి బయటి నుంచి వాహనాలు రావడానికి కూడా వుండేది కాదు. ఆ సమస్య నుంచి బైట పడ్డం కోసం రోడ్డు వేయించుకున్నారు. ఇక ఊళ్లోనే ప్రభుత్వ ఆసుపత్రి కట్టించుకోవాలన్నది మీనా బెహెన్ బృందం కోరిక.

సుష్మాభదు

రాధాదేవి

మీనా బెహెన్

సోడా! రాజస్థాన్‌లోని ఓ చిన్ని గ్రామం. చావి రజావత్ సర్పంచ్‌గా ఎన్నికయ్యాక... అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయా పల్లెవాసులకు. మరీ ముఖ్యంగా....నీరు, సోలార్ విద్యుత్తు, రోడ్లు, మరుగుదొడ్లు, బ్యాంకును ఏర్పాటు చేయించిన ఘనత రజావత్‌దే. ఎం.బి.ఎ చదివి జీన్స్ ప్యాంట్లు వేసుకునే రజావత్ పల్లెటూరులో పనిచేసే సర్పంచ్ అంటే ఎవ్వరూ నమ్మరు.

సలామ్ ఖేరా, చబ్లామొరి, ధని మియాన్ ఖాన్! హర్యానాకు చెందిన మూడు చిన్న చిన్న గ్రామాలు. ఈ మూడు గ్రామ ప్రజల మన్ననలు అందుకుంటున్న సర్పంచ్ సుష్మా భదు. బాలికల విద్య, స్త్రీపురుష నిష్పత్తి పెరుగుదలకు ఆమె ఎంతగానో కృషి చేశారు. అయితే వీటన్నిటినీ మించి సుష్మా మరో అంశంలో రికార్డు సృష్టించింది. మహిళలను అణచివేస్తున్న పితృస్వామిక భావజాలం పైన ఆమె చేస్తున్న పోరాటం అంతా ఇంతా కాదు. తన అత్త, భర్త మద్దతుతో పాతిక గ్రామాలకు చెందిన రెండు వేల మంది ప్రజల ముందు సంప్రదాయ ముసుగును తొలగించి వార్తలకెక్కింది. అంతే కాదు! తన ఇద్దరు కుమారులకు వరకట్నం తీసుకోకుండా వివాహం చేసింది. పైగా తన కుమార్తెలు ఆధునిక వస్త్రాలు వేసుకోవడానికి ఎటువంటి అభ్యంతరాలు పెట్టలేదు.

రాజస్థాన్‌కు చెందిన మరో మహిళా సర్పంచ్ రాధా దేవి. విద్యా హక్కు చట్టం వున్నప్పటికీ రాజస్థాన్‌లోని ఎందరో ఆడపిల్లలు బడికి దూరంగా వుండడాన్ని సహించలేకపోయింది. సర్పంచ్‌గా ఎన్నికయ్యాక ఆ పరిస్థితి గ్రామంలో వుండకూడదనుకుంది. స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక బృందాల సాయంతో అనుకున్నది సాధించింది. గ్రామంలోని అధికారులు, తల్లిదండ్రులతో మాట్లాడి ఆడపిల్లలు బడికి వెళ్లేలా చేయగలిగింది.

సమస్యలపై సమరం చేస్తున్న సర్పంచులు వీళ్లు. మహిళలకే కాదు! పురుషులకూ స్ఫూర్తి ప్రదాతలే! కాదంటారా!?

ఆర్తి దేవి

వెలుగు జాడ

అట్టమీది కథ

తెలుగు సాహితీ రంగానికి ముత్యాల సరాలతో ఆధునిక సొబగులద్ది సామాన్యుడి చెంతకు చేర్చిన వైతాళికుడు గురజాడ. మహాకవి గురజాడ జీవించింది అయిదు పదులే అయినా పది కాలాల పాటు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశాయి ఆయన రచనలు. ఆయన నూరవ వర్థంతి సంవత్సరమిది. ఈ సందర్భంగా అట్టమీది కథలో గురజాడను స్మరించుకుందాం.

- దివాకర్, కె. గడ్డెన్న

గురజాడకు ముందు ఎందరో సాహితీ మూర్తులు ఉన్నారు. అపార సాహితీ సంపద వుంది. పోతన, పాల్కురికి సోమనాథుడు, వేమన లాంటి వారిని మినహాయిస్తే ఆనాడు వచ్చిన సాహిత్యమంతా పండిత ప్రకాండులకే తప్ప సామాన్యులకు ఒక పట్టాన అర్థమయ్యేది కాదు. గ్రాంథిక భాషకు తప్ప గ్రామ్య (వ్యవహారిక) భాషకు ఆనాడు చోటు లేదు. ఛందస్సులు, వ్యాకరణ బంధనాల మధ్య బందీ అయిన భాషా సంకెళ్లను తెంచి వ్యవహారిక పంథాలోకి తెచ్చిన ఘనత గురజాడ, ఆయన సహాధ్యాయి వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులకేదక్కుతుంది. ప్రజల భాష అయిన వ్యవహారిక భాషలోనే విద్యా బోధన జరగాలని గట్టిగా పోరాడాడు. గ్రాంథిక భాషలో విద్యాబోధనకు తాను సభ్యునిగా వున్న కమిటీ నిర్ణయించినపుడు దానికి వ్యతిరేకంగా అసమ్మతి పత్రాన్ని సమర్పించాడు. గ్రాంథిక భాషపై తిరుగుబాటు చేసి వ్యవహారిక భాషలో మొట్టమొదటి తెలుగు కావ్య రచన (కన్యాశుల్కం)కు శ్రీకారం చుట్టాడు. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' 'వట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్', 'మంచియన్నది ఎంచి చూడగ మనుజులందున రెండు కులములు, మంచి అన్నది మాల అయితే మాల నే అగుదున్', 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటె నిలిచి వెలుగున్' మంచి గతమున కొంచెమేనోయ్ మందగించక ముందుకు అడుగేయ్' అని ఎలుగెత్తి చాటాడు. తెలుగు జాతికి కొత్త వెలుగునిచ్చాడు. ఆయన రాసిన దేశభక్తి గీతం ప్రతి ఒక్కరూ తనివితీరా పాడుకునే చక్కటి సంగీతం. ఈ గీతంలో ప్రతి అక్షరం, ప్రతి పదం మనల్ని తట్టి లేపుతుంది. సమాజ అభ్యుదయానికి పాటుపడమని కర్తవ్య బోధ చేస్తుంది. దేశమంటే మట్టి కాదు మనుషులని చెప్పడం ద్వారా దేశ భక్తికి కొత్త నిర్వచనం ఇస్తుంది. నిజంగానే ఇది జాతీయ గీతానికి ఏమాత్రం తీసిపోదు.

మతంపై ఈసడింపు

కులం, మతం, జాతి, ప్రాంతం, భాషా భేదాలతో కొట్లాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రజలందరి మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేం దుకు గురజాడ 'దేశ భక్తి ' గీతం ప్రాధాన్యత మరింత పెరిగింది. కులం పేరుతో, మతం పేరుతో, దేవుడు పేరుతో సాగే దురన్యాయాల్ని, దుర్మార్గాల్ని ఈసడించుకున్నాడు. కులం, మతం కాదు గుణమే గొప్పదన్నాడు. పాతకాలపు బూజు పట్టిన సంస్కృతి సంప్రదాయాలను కలంతో చీల్చి చెండాడాడు. బ్రిటిష్‌వాడు భారత దేశంలో తన అధికారాన్ని పదిలపరచుకోవడానికి భారత ప్రజల మధ్య బెంగాల్ విభజన పేరుతో చిచ్చు పెట్టడాన్ని గురజాడ నిరసించాడు. దీనికి విరుగుడుగా 'అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెను' అని మత సామరస్యాన్ని ప్రబోధించాడు.

సమాజ ప్రగతిని కాంక్షించిన గురజాడ తన సాహిత్యంలో అనేక ప్రతిపాదనలు, ప్రకటనలు చేసి చర్చకు పెట్టారు. అందులో భాగంగానే మతం పట్ల కూడా తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. "మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అని చెబుతారు. మనిషి జ్ఞానాన్ని పెంచుకునే కొద్దీ, విజ్ఞాన శాస్త్రాలు అభివృద్ధి చెంది ప్రకృతి శాస్త్రాలను తెలుసుకొని, అంతగా శాస్త్రాలు అభివృద్ధి కాని రోజులలో ఏర్పర్చుకొన్న మత భావాలను విడిచిపెట్టి, మతములు మరుగునపడి జ్ఞానము పైచేయి సాగించి సమాజాన్ని మరింత ముందుకు తీసుకుపోతుందని ఆకాంక్షించారు. కాని ఈనాడు భక్తి ఉద్యమం మంచి ఊపుమీద ఉన్న విషయాన్ని ప్రతిరోజు మన అనుభవములోనికి వస్తోంది. పదేళ్ళ క్రితం వరకు మధ్యతరగతి మగవారు మాత్రమే అయ్యప్ప మాల దీక్ష చేసేవారు. ఈ రోజున క్రింది వర్గాల వారు, శ్రామికులు అయ్యప్పతో సహా అనే దీక్షలు, మాలలు, భజనలు చేస్తున్నారు. విజయవాడ కనకదుర్గ, స్థానిక దేవుళ్ళు, దేవతలకు కూడా ఆడా మగ పిల్లలు అన్న తేడా లేకుండా అందరూ దీక్షలు పూనుతున్నారు. మగవారు భవానీ మాలలో దాదాపు ఆడవేషం వేస్తున్నంత పని చేస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు బాబాల నగర సంకీర్తనలు,

ఉదయం, సాయంకాలం భజనలు అట్టహాసంగా
చేస్తున్నారు. మధ్యతరగతి మహిళలు తమ ఖాళీ సమయాలలో ఊరూవాడా తిరిగి సహస్ర నామాలను ఆలపిస్తున్నారు. వీటన్నింటికి పరాకాష్ఠ మానవ మేధస్సులో అనేక వందల మంది శాస్త్రవేత్తల కృషితో తయారు చేసిన రాకెట్లు, గ్రహాల నమూనాలను వేంకటేశ్వరస్వామి పాదాల దగ్గర స్వయానా ఇస్రో ఛైర్మన్ పూజలు చేయడం, ప్రయోగాలకు ముహూర్తాలు చూసి ప్రయోగించడం.

"మతం వేరైతేను యేమోయి?
మనసులొకటై మనుషులుంటే"

మార్క్స్ చెప్పినట్లు మత భావాలు పాత సమాజం కూలిపోయిన తరువాత కూడా దీర్ఘకాలం కొనసాగుతాయని, అయినప్పటికీ మతం వ్యక్తిగత స్థాయికి పరిమితమై పరమత సహనంతో ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారు. అలా జీవిస్తే సమస్య లేదు. సమస్యంతా మతోన్మాదంలోనే. ఈ మత భావాలను ఉద్దేశపూర్వకంగానే వ్యాప్తి చేసి ఉద్రేకాలను ప్రేరేపించి ప్రజల మధ్యన ఉన్న ఐక్యతను దెబ్బతీయడానికి ఉపయోగించుకుంటున్నారు. గురజాడ "అన్నీ వేదాల్లోను ఉన్నాయష" అని కన్యాశుల్కంలో వెంకమ్మ చేత చెప్పించి, వేదం కంటే ఇంగ్లీషు చదువే గొప్పదని అభిప్రాయపడుతుంది. నిజానికి సింధునాగరికత ప్రపంచంలో వెలసిన ప్రాచీన నాగరికతకు దీటైనది వరాహమిహరుడు. పతంజలి, ఆర్యభట్ట మొదలగు భారతీయ శాస్త్రవేత్తలు శరీర శాస్త్రంలోను, ఖగోళ శాస్త్రంలోను మంచి జ్ఞానాన్ని సంపాదించారు కాని అన్నీ వేదాల్లోనే ఉన్నయి అనే నమ్మకంతో కొన్ని శతాబ్దాలు వెనుకబడిన సంగతి దాని పర్యవసానంగా పరాయిపాలనలోకి దిగజారిన చరిత్ర మనకు తెలుసు. అయినప్పటికీ ఛాందసులు వేదగణితాన్ని ముందుకు తెస్తున్నారు. వేదకాలం నాటి గణితానికి, నేటి ఆధునిక గణిత శాస్త్రం కొన్ని వేల రెట్లు అభివృద్ధి అయ్యింది. అందుకనే

వెనుక చూసిన కార్యమేమోయి?
మంచిగతమున కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనుక పడితే వెనకే నోయి

అని వాస్తవాన్ని అర్థం చేసుకొని గతంలో ఉన్న కొద్దిపాటి పురోగామి లక్షణాలను తీసుకొని ముందుకు నడిపిస్తారు. ఈ మత వైషమ్యాలను, విద్వేషాన్ని రగిలిస్తున్న వారు ఆర్యులమని, ఆర్య జాతే ఉన్నతమైనదని తమని తాము ప్రచారం చేసుకుంటున్న సమయంలో

నిన్న వచ్చిరింగిలీషులు
మొన్న వచ్చిరి ముసలమనులటు,
మొన్న వచ్చిన వారవీవని
మరచి వేరులు బెట్టకోయి

అని తీవ్ర స్వరముతో తన నిరసనను చారిత్రక ఆధారాలతో నిరసిస్తారు.

దూర బంధువు యితడు భూమికి
దారి చూపుచు చూడవచ్చెను
తలతునేనిది సంఘ సంస్కరణ
ప్రయాగ పతాకగానే

అని తోకచుక్క అరిష్టమన్న ప్రచారాన్ని తిప్పికొట్టి దానిని సంఘ సంస్కరణోద్యమ పతాకగా పరిగణిస్తానని అంటారు. మనిషి చేసిన రాయి రప్పకు మొక్కవద్దు. మనిషి యందే మాత్రుడున్నాడని... మనిషే అన్ని సాధించుకుంటాడని చెబుతారు.
రానురాను వాస్తు పిచ్చి వెర్రితలలు వేస్తోంది. అభద్రమైన తమ జీవితాలకు ఏవేవో అభౌతికమైన అవాస్తవమైన నమ్మకాల వెనుక పరుగులు తీస్తున్నారు. కాని గురజాడ గృహాన్ని పరిశీలిస్తే ఉత్తర ముఖంగా ఉండడంలో ఇంటివెనుక అంటే దక్షిణ భాగాన నుయ్యి ఉంది. ఈశాన్య భాగం ఎత్తుగా ఉంటుంది. ఈ రెండు గృహ వాస్తుకి వ్యతిరేకం. అంటే ఆ రోజుల్లో గృహ నిర్మాణాలకు పెద్దగా వాస్తు నియమాలు అమలులో లేవని అర్థం అవుతుంది. మొత్తంగా చూస్తే గురజాడ పక్కా భౌతికవాదిగా, వాస్తవవాదిగా, మానవతా వాదిగా మనం అర్థం చేసుకోవాలి. గురజాడ ఇప్పుడు కొందరికి గౌరవాన్ని పెంచే సరుకుగా మారాడు. ఆయన భావజాలాన్ని వ్యతిరేకించే వాళ్ళు పక్కా సాంప్రదాయ వాదులు. వాళ్ళు ఇప్పుడు గురజాడను నెత్తిన పెట్టుకొని మోయడం విడ్డూరంగా కనిపిస్తుంది.
ఆ మధ్య గురజాడ ఇంటిని మరమ్మత్తులు చేపట్టిన ఒక మూఢ మిత్రుడు వాస్తు దోషాలను

ఎవరేమన్నారు?

గిడుగు రామమూర్తి (1863-1940)

'అతని మరణంతో ఒక గొప్ప వ్యక్తినీ, ఒక పరోపకార పరాయణుని, మహాపండితుని మన దేశం పోగొట్టుకున్నది. 'తెలుగు ప్రజలందరి స్మృతి పథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికీ ఆయన జీవిస్తున్నాడు. అతణ్ణి తలచుకోవ డమంటే మన జీవితాలలోని అత్యంత ఆనందమయ సంఘటనలను మనం స్ఫురణకు తెచ్చుకోవడమే'

(గిడుగు సానుభూతి లేఖ, 1915, డిసెంబరు 5)

తాపీ ధర్మారావు(1887-1973)



బ్రిటీషువారి సాంగత్యం వల్లా, ఇంగ్లీషు వాఙ్మయ పరిచయం వల్లా, ప్రజల అభిప్రాయాలు మారుతున్నాయి. కొత్త భావాలు పుడుతున్నాయి. సారస్వతసేవకు ఎన్నెన్నో ఊహలు పొడచూపుతున్నాయి. సాహిత్యం ప్రజల సొత్తు కావాలన్న సంకల్పం బలపడుతూ ఉంది. భాషనూ భావాన్నీ నిర్దాక్షిణ్యంగా పరిష్కరించకపోతే మన సాహిత్యానికి మోక్షం లేదని నిర్ధారణ అయింది. ప్రతికూల వాదనలు అనేకం వస్తాయని మనవారికి తెలీకపోలేదు. ఎటువంటి ఇబ్బందికయినా సిద్ధపడి వాఙ్మయాన్ని ఉద్ధరించాలని కొందరు ఉదార భావుకులు, భాషా సేవకులు బయలుదేరారు. సారస్వతాన్ని కొత్తపుంతల్లో నడిపి ప్రజా మన్ననలను పొందుతూ ఉన్నారు. వారిలో గట్టిగా చెప్పుకోగలవాడు మహాకవి గురజాడ.

(గురజాడ సమకాలిక సాంఘిక, రాజకీయ, సారస్వత పరిస్థితులు)

ఆరుద్ర (1925-1998)

వ్యక్తులపైన ద్వేషం పుట్టించకుండానే ఆయా వ్యక్తులు ఏ సంప్రదాయాలకు బానిసలో, ఏ సంస్కారాలకు వారసులో, ఏ బలహీనతలకు బంధితులో, ఏ ఛాందసాలకి బలి పశువులో చెప్పాలనే తహతహ బాధ్యతాయుతమైనదే. నిమిత్తమాత్రమైన ఒక సన్నివేశాన్ని తీసుకొని, దానికి కారణభూతమైనవాళ్ల కేసు హిస్టరీలు తయారు చేసి, ఆ సంఘటన మీదుగా సంకీర్ణ ఇతివృత్తాన్ని అల్లి, వాస్తవాన్ని కావ్యంగా మార్చి, కావ్యాన్ని జీవితంలాగా భ్రమింపజేయడం, ప్రథమ శ్రేణి రచయితకే సాధ్యమవుతుంది. ఆధునికయుగంలో అటువంటి పనిచేసినవాడు గురజాడ అప్పారావుగా రొక్కరే. ఇతరులెవరూ అలా చేయలేదనే వారి బాధ.

(అప్పారావుగారి పంచదారమాత్రులు (శతజయంతి సంచిక)

వెలికితీసి వాటిని సరిచేయ పూనుకోగా ప్రగతిశీల వాదుల అభ్యంతరంతో ఆ ఆలోచనను వాయిదా వేశారు. అలాగే పుత్తడి బొమ్మ పూర్ణమ్మ నృత్య రూపకాన్ని ఒక ప్రసిద్ధ నాట్యాచార్యులు ప్రదర్శించారు. అందులో అవసరమైన భావజాలాన్ని యథాతథంగా ప్రదర్శించకుండా, పూర్ణమ్మ దేవి పూజను బాగా సాగదీసి హైలైట్ చేశారు. అది చూసిన వారికి గురజాడ దేవీ ఉపాసకుడేమోనని తప్పుడు అభిప్రాయం కలగడానికి ఎక్కువ అవకాశాలున్నాయి. 150వ జయంతి సందర్భంగా "అంతన్నారు ఇంతన్నారు ముంతమామిడి పండన్నారు" గురజాడ గృహాన్ని పరిరక్షించి 35 లక్షలతో ఒక పర్యాటక కేంద్రంగా మలుస్తామన్నారు. విజయనగరంలో మూడు కోట్ల వ్యయంతో ఒక ఆడిటోరియం నిర్మిస్తామన్నారు. ఆ మేరకు శిలాఫలకాలు కూడా వేశారు. కాని అమలు కాలేదు. ప్రభుత్వం మారింది. 152వ జయంతి ఉత్సవాలు జరిపారు. కాని పరిరక్షణ, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పని మొదలు కాలేదు సరికదా ఉన్న ఇల్లు ప్రమాదకరంగా మారుతోంది. గురజాడ కొత్త గృహాన్ని వారసులు డెవలప్‌మెంట్‌కు ఇవ్వగా ఆ బిల్డరు కొత్త ఇంటిని పడగొట్టడంతో పశ్చిమ గోడ కిటికీలు ప్రహరీగోడ పాక్షికంగా దెబ్బతిని ఉన్నాయి.అందుకే... గురజాడ గృహాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనదే.

◆◆◆◆◆◆◆◆◆

రచయిత...పరిశోధకుడు...

విజయనగరం ఆనందగజపతి సంస్థానంలో పరిశోధకుడిగా, రీవారాణి ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసిన గురజాడ రాచరికం కన్నా ప్రజాస్వామ్యం వెయ్యి రెట్లు మేలు అని భావించాడు. డబ్బుకు దాసోహమై కన్న బిడ్డలను కాటికి కాలు చాపే ముసలోళ్లకు కట్టబెడుతున్న దుర్మార్గానికి నిరసనగా 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' అనే చిరు కావ్యాన్ని రాశాడు. సంఘ సంస్కరణోద్యమాభిలాషతో ఆయన రాసిన 'కన్యాశుల్కం' నాటకం నాటికి, నేటికీ, ఇంకెన్నటికీ అజరామరంగా నిలిచిపోతుంది. వాస్తవికతను ఇంత సమగ్రంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దిన నాటకం తెలుగుసాహిత్యంలో వజ్రపు తునక. అందులో హాస్యం, వ్యంగ్యం, చమత్కారాన్ని తగు పాళ్లలో మేళవించిన తీరు అద్భుతం, అనితర సాధ్యం. వేశ్య అయిన మధురవాణిని ఉదాత్తంగా చిత్రించాడు. సంస్కారి ముసుగులో వున్న గిరీశం లాంటి వాగాడంబరులు సమాజం మీద పడి ఎలా బతికేస్తుంటారో వాస్తవికతకు అద్దంపట్టేలా చూపాడు. నేటి ప్రపంచీకరణ యుగంలో ఇటువంటి గిరీశంలు మనకు అడుగడుగునా ఎదురవుతుంటారు. కన్యాశుల్కంలో స్త్రీ పాత్రలను నైతికతలో పురుష పాత్రల కన్నా ఉత్కృష్టమైనవిగా చిత్రించాడు. స్త్రీల పట్ల అపారమైన గౌరవాభిమానాలు కలిగిన గురజాడ తన రచనలన్నిటిలోనూ మహిళాభ్యుదయానికి పెద్ద పీట వేశాడు. ఆయన రాసిన కన్యక, పూర్ణమ్మలలో కూడా ఇదే మనకు కనిపిస్తుంది.స్త్రీ ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం ఒక ముఖ్య కారణమని ఆనాడే చెప్పాడు గురజాడ. 'ఆధునిక స్త్రీ మానవ చరిత్రను తిరగరాస్తుంది' అన్న మాటలు మహిళా అభ్యున్నతి పట్ల ఆయనకున్న ప్రగాఢవిశ్వాసాన్ని తెలియజేస్తాయి. స్త్రీ స్వేచ్ఛకు ప్రతిబంధకాలుగా వున్న కులం, మతం, ఆచార సంప్రదాయాలను తీవ్రంగా నిరసించాడు. మతంపేరుతో చేసే మతిమాలిన పనులను ' పెద్ద మసీదు', 'మీ పేరేమిటి?' కథల్లో గట్టిగా ఎండగట్టాడు. ఇలా ప్రతి రంగంలోను, ప్రతి అంశంలోను ఆధునిక నాగరికత, ప్రజా సంస్కృతికి పట్టం గట్టాడు. మహా కవి శ్రీ శ్రీ పేర్కొన్నట్లు ఆధునిక తెలుగు సాహిత్యానికి, కవిత్వానికి కొత్త ఒరవడి దిద్దిన మహాకవి గురజాడ.

◆

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి (1891-1960)



తోకచుక్క విచ్ఛిత్తికి సూచకం. వేగుచుక్క మహోదయానికి సూచికం. నిజమేకాని, ఈ తోకచుక్క ఏమిటి? ఇది చేసిన వినాశమేమిటి? ఈ వేగుచుక్క ఏమిటి? దీని తర్వాత జరిగిన మహోదయమేమిటి? అంటే-వశ్యవాక్కులు శ్రీభమిడిపాటి కామేశ్వరరావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారే తోకచుక్క అని వ్యాఖ్యానం చేశారు. రామమూర్తి పంతులుగారు చేసింది కృతక భాషావిధ్వంసమేగా? అప్పారావుగారు చేసింది కవికుమారుల కళ్లకు వెలుగు కలిగించడమేగా? అంచేతనే మిత్రులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు అలా పేర్కొన్నారు. అప్పారావు గారిని భమిడిపాటి కామేశ్వ రావు స్వయంజ్యోతి అని, 'ప్రథమాంధ్ర రచనా బ్రహ్మ' అని కీర్తించారు.

('మార్గదర్శి గురజాడ అప్పారావు', నవోదయ, డిశంబర్ 1946)

దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి, (1897-1980)



గురజాడ అప్పారావు 1915లో చనిపోయినా, 1915 తర్వాతనే జీవించడం ప్రారంభించాడు. ఆయన 'బిల్హణీయమా', 'నీలగిరిపాటలూ', ఆంధ్ర పత్రిక సంవత్సరాది పత్రికలో పద్యాయని జ్ఞాపకం.'లవణరాజు కల', 'కన్యక', 'పూర్ణమ్మ', మొదలైన కావ్యాలు బందరు నుంచి వెలువడే ఆంధ్రభారతి నుంచి కాబోలు చదివాము. కాల్పనికోద్యమంలో ఉత్తమ లక్షణాలన్నీ స్వచ్ఛమూ, నిసర్గసుందరమూ అయిన ఆయన వాణిలో కనపడతాయి. సామాన్యుల గాథలు, సామాన్యులకందే మాటలూ కావ్యావరణం లోనికి ప్రవేశపెట్టడం ఆయన గొప్పతనం.ఆ ముత్యాలవసరం కూడా అలాగే అమరింది. ఆ ఛందస్సు తెలుగువాడి కష్టసుఖాలు కథలూ, ఎంత బాగా చెప్పతుంది! 'నలుగురు కూర్చొని నవ్వేవేళల పుత్తడి బొమ్మను పూర్ణమ్మను ఒకపరి తలచి' కన్నీరొలికించడమూ, 'పెరిగి విరిగితి విరిగి పెరిగితి'నని సొంత కష్టసుఖాలు తలపోసుకుని వాపోవడమూ, 'ప్రేమకలుగక బతుకు చీకటి' అని ప్రేమికుడు కావడమూ-ఇవన్నీ ఆ కొత్త రోజుల్లో యువకవుల హృదయాలకు ఆనంద పక్షాలు తొడిగి, గూటిని దాటి ఎరుగని వాటికి కొండంత జీవితాకాశాన్ని చూపెట్టాయి. వీరి రచనలన్నింటిలోనూ వీరేశలింగం మనోవోద్యమ ప్రభావమే కనబడుతుంది.

(పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం,
'భారతి' రజతోత్సవం సంచిక, జనవరి 1949)

పురిపండా అప్పల స్వామి (1904-1982)

ఒక పుష్కర కాలం గడిచాక 1909 అప్పారావుగారు దానికి మెరుగు పెట్టి తిరిగి అచ్చు వేశారు. మొదటిది' పాత కన్యాశుల్కం' అనీ , రెండోది 'కొత్త కన్యాశుల్కం' అనీ మనం అనుకుందాం. పాత కన్యాశుల్కం గనిలోంచి తీసిన ముడి వజ్రల అయితే, కొత్త కన్యాశుల్కం సానపట్టిన మేలిమి వజ్రం. కొత్తదానికి ఎంత మెరుగు పెట్టాలో అంత మెరుగూపెట్టారు. అప్పారావుగారు. ఎన్ని వన్నెలు దిద్దాలో అన్నివన్నెలూ దిద్దారు. అదేకథ-కొత్త మలుపులు తిప్పారు. కొత్త రంగాలు కలిపారు. కొత్త పాత్రలు చేర్చారు. భాషలో భావంలో కొత్తశిల్పం దిద్దారు. నాటకానికి నవ్యత్వం కల్పించారు. పాత్రలకి జీవం పోసి అమరత్వం ప్రసాదించారు.

('పాత కొత్త కన్యాశుల్కాల్లో గిరీశం' (నటరాజ కళాసమితి' సంచిక-1980)

గురజాడ జీవిత విశేషాలు

గురజాడ విద్యనభ్యసించిన కళాశాల

ఆయన వాడిన కుర్చీలు

1861 సెప్టెంబరు 21న విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకు రాయవరం గ్రామంలో పుట్టాడు గురజాడ. పుట్టింది విశాఖ జిల్లాలో అయినా జీవితంలో ఎక్కువ భాగం విజయనగరంలో సాగింది. ప్రాథమిక విద్య చీపురుపల్లి గ్రాంట్ స్కూలులోను, విజయనగరం మిడిల్ స్కూలులోనూ సాగింది. 1882లో మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. మెట్రిక్యులేషన్‌లో ఆయన సహాధ్యాయి గిడుగు రామ్మూర్తి పంతులు. ఆ తరువాత ఎఫ్ఎ, డిగ్రీ చదివాడు. చదువు పూర్తయిన తరువాత కాలేజీలో కొన్నాళ్లు అధ్యాపకునిగా, డిప్యూటీ కలెక్టరాఫీసులో ప్రధాన గుమస్తాగా కొన్నాళ్లు పనిచేశాడు. ఆనందగజపతి సంస్థానంలో పరిశోధకుడిగా, రీవారాణి ఆంతరంగిక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. మద్రాసు యూనివర్సిటీ ఫెలోగా నియమితుడయ్యాడు. . మెట్రిక్యులేషన్ చదువుతుండగానే ఆంగ్లంలో కవితలు, వ్యాసాలు రాయనారంభించాడు. మొదట సాంప్రదాయిక రీతిలో పద్యాలు రాసేవాడు. గిడుగుతో పరిచయం అయ్యాక అయనతో కలిసి వ్యవహారిక భాషోద్యమం నడిపాడు. 1914లో వచన భాషా వివాదాన్ని పరిష్కరించేందుకు మద్రాసు విశ్వ విద్యాలయం ఒక సబ్ కమిటీని వేసింది. ఆ కమిటీలో వేదం వెంకటరాయ శాస్త్రి, కొమర్రాజు లక్ష్మణ రావు, జయంతి రామయ్య పంతులు, ప్రొఫెసర్ రంగాచార్యులు, జి.వెంకట రంగారావు, గురజాడ అప్పారావు సభ్యులు. వ్యవహారిక భాషలో రచన వుండాలని గట్టిగా వాదించింది గురజాడ ఒక్కరే.మిగతావారంతా గ్రాంథిక భాషను సమర్థించారు. గురజాడ వాదం వీగిపోయింది. ఈ తీర్మానాన్ని తాను ఆమోదించలేనని గురజాడ 172 పేజీల అసమ్మతి పత్రాన్నొకదానిని కమిటీకి సమర్పించాడు. సాహిత్య విమర్శనా వ్యాపకం, మధ్యలో ఎపిగ్రాఫిక్స్ శాసనాలు, చరిత్రల పరిశోధనా వ్యాపకాలు ఏక కాలంలో నిర్వహించి తన బహుముఖ ప్రజ్ఞను చాటాడు. కళాకారుడిగా, సాహితీ స్రష్టగా, సంఘ సంస్కర్తగా, వైతాళికునిగా నిలిచాడు. చివరికి 1915 నవంబరు 30న కన్నుమూశారు.

కొన్ని ముఖ్య ఘట్టాలు

21-9-1862 :విశాఖపట్టణం జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గురజాడ అప్పారావు జన్మస్థలం.

1882 :మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత

1885 : అప్పలనరసమ్మతో వివాహం.

జనవరి 1886 :తత్వశాస్త్రం, సంస్కృతం రెండవ భాషగా బి.ఏ. ఉత్తీర్ణత.

1887 :విజయనగరం మహారాజు ఆనందగజపతితో పరిచయం.

ఆగస్టు 1892 :'కన్యాశుల్కం' నాటకం మొదటి కూర్పు ప్రదర్శనం.

1894 : 'శ్రీరామ విజయం' సంస్కృత నాటక సమీక్ష ఇంగ్లీషులో, సి.పి.బ్రౌన్ రాయించిన 'తాతాచార్యుల' కథల సంపుటంలో.

5-6-1896 :ఆనందగజపతి సంస్థాన శాసన పరిశోధకుడిగా నియామకం

1-1-1897 :అంతకు ముందే ముగించిన 'కన్యాశుల్కం' నాటకం మొదటి ప్రచురణకు ఉపోద్ఘాత రచన, ఆనందగజపతికి అంకితం.

1897 : 'హరిశ్చంద్ర' ఇంగ్లీషు నాటకానికి పీఠిక

జూన్ 1898 :ఆనందగజపతి సోదరి రీవామహారాణికి (అప్పలకొండయాంబకు అంతరంగిక కార్యదర్శిగా నియామకం)

1902 : తృతీయ సంతానం కుమార్తె (పులిగెడ్డ కొండయమ్మ)

24-4-1905 : తండ్రి మరణం

1906 : గిడుగు రామమూర్తి తదితర ప్రముఖులతో చర్చలు – వ్యవహారిక భాషా ఉద్యమం ప్రారంభం, ఆ మహోద్యమానికి సారథ్యం.

1906 : 'కొండు భట్టీయం' మొదటి రచన

1907 : 'నీలగిరి పాటలు' ప్రచురణ

1909 : 'కన్యాశుల్కం'లో మార్పులు, రెండవ ప్రచురణ; మే నెల ఒకటవ తేదీన, ఉదకమండలం 'ఎల్క్‌హిత్ హవుస్'లో రెండవ ప్రచురణ పీఠిక ఇంగ్లీషులో రచించారు. వాస్తవిక రచనా లక్షణాలను ప్రతిపాదిస్తూ ఒక లేఖ వ్రాశారు.

1910 : బరంపురంలో వివిధ కులాలవారి సహపంక్తి విందులో పాల్గొన్నారు.

1910 : 'ముత్యాల సరాలు' రచన 'కొండు భట్టీయం' రెండవసారి రచించారు.

21-4-1910 : 'బిల్హణీయం' మొదటి అంకం ప్రచురణ

24-11-1910 :'గ్రామ్యశబ్ద విచారణము' వ్యాసరచన

29-12-1910 :'ఆకాశరామన్న'కు జవాబుగా వ్యాసరచన

27-3-1911 :'నాది ప్రజల ఉద్యమం, దానిని ఎవరిని సంతోష పెట్టడానికయినా వదులుకోలేను' అంటూ గురజాడ ఆంధ్ర సారస్వత ప్రపంచంలో 'మాగ్న కార్టా' ప్రకటించారు.

ఏప్రిల్ 1911 :'బిల్హణీయము' రెండవ అంకం ముద్రణ

21-1-1912 :గురజాడ గౌరవార్థం కలకత్తాలో బెంగాలీ సాహిత్య పరిషత్తు తేనీటి విందు, సభ

16-5-1912 :మద్రాసులో, ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో, వ్యావహారిక భాషా ప్రయోజనం గురించి ప్రసంగం

27-6-1912 :తెలుగుభాషలో సాంకేతిక పదాల కూర్పుకు ప్రయత్నం

15-11-1912 :'కన్యక' ప్రచురణ

డిసెంబర్ 1912 :కలకత్తాలో రవీంద్రునితో సమావేశం

1913 : 'సుభద్ర' పద్యకావ్య రచన

20-1-1913 :మద్రాసు విశ్వవిద్యాలయంలో 'ఫెలోగా నియామకానికి గవర్నర్ అభ్యర్థన

20-4-1914 :'ది మినిట్ ఆఫ్ డిసెంట్ టు ది రిపోర్ట్ ఆఫ్ ది తెలుగు కాంపోజిషన్ సబ్-కమిటీ' (అసమ్మతి పత్రం) ప్రచురణ

30-10-1914 :'దించు లంగరు' ప్రచురణ

1915 : 'లంగరెత్తుము' రచన; నూతనగృహ ప్రవేశం

30-11-1915 :విజయనగరంలో ఉదయం ఎనిమిది ఇరవై నిమిషాలకు మహాకవి అస్తమయం.

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -13)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

రైతులిక కోలుకోలేరు. వ్యవసాయం మీద ఆశ వదులుకున్నారు. ఈ ప్రకృతి శాపమే పరిశ్రమలకు లాభించింది. ఇప్పుడవి ఇరవై నాలుగ్గంటలూ పని చెయ్యగలిగినంత మంది కూలీలు వచ్చిపడుతున్నారు. 1800తో పోలిస్తే యూరప్ జనాభా నలభై శాతం పెరిగింది. వీళ్లందరికీ పారిశ్రామిక ఉత్పత్తుల అవసరం ఉంటుంది. అవకాశం దొరికినప్పుడే లాభాలు మూటగట్టుకోవాలి. ఇదివరలో డిమాండ్‌ను బట్టి ఉత్పత్తి జరిగేది. ఇప్పుడు ఉత్పత్తి వ్యయం తగ్గటం వల్ల లాభాలే సర్వస్వమనుకున్న ఫ్యాక్టరీల యజమానులు, వినియోగదారుల మీద వస్తువులతో దాడి చేశారు. ఒకవేళ, స్థానికంగా తమ ఉత్పత్తులకు డిమాండ్ లేదనుకుంటే, కొత్తగా వచ్చిన రైళ్లు, స్టీమ్ షిప్పులలో దూర ప్రాంతాలకు తరలించి అమ్మారు. రహస్యం తెలిసింది. వ్యాపారాభివృద్ధికి ఆకాశమే హద్దు. ముఖ్యంగా, అత్యంత పారిశ్రామికీకరణ చెందిన దేశంగా, ఇంగ్లండులో ఈ మనస్తత్వం ఫ్యాక్టరీ యజమానులకు బాగా పాకింది. ఒకప్పుడు 'నాకేది అవసరం?' అని ప్రశ్నించుకుని ఏదైనా కొనుగోలు చేసేవారు. ఇప్పుడు 'నా కోరిక ఎలా తీరుతుంది?' అని కలలుగంటున్నారు. అయితే, ఈ రెండు ప్రశ్నలు అడిగేవాళ్ల మధ్య ఎవరూ పూరించలేనంత అంతరం వుంది. వ్యాపారంతోపాటు ఉద్యోగాలు పెరిగిన మాట నిజమే. కాని పెరిగిన జనాభాకు అవి సరిపోలేదు. పైగా ఈ ఉద్యోగాలు చేసేంది యంత్రీకరణ వల్ల వృత్తులు కోల్పోయిన వాళ్లూ, వ్యవసాయం లాభసాటిగా లేక నగరాలకు తరలివచ్చిన కర్షకులూ కాదు. ఫ్యాక్టరీ యజమానులు మొదట మహిళల్నీ, చిన్న పిల్లల్నీ కూలీకి పెట్టుకున్నారు. మగవాళ్లకిచ్చే కూలీతో పోల్చితే వీళ్లకిచ్చేది చాలా తక్కువ. ఎన్ని కష్టాలున్నా, వృత్తులలో, వ్యవసాయంలో ఒక భద్రత వుండేది. ఫ్యాక్టరీ ఉద్యోగాలలో అది లేదు. ఎప్పుడు ఉద్యోగంలోంచి తొలగిస్తారోనని ప్రతి రోజూ భయమే. ఈ కుటుంబాలన్నీ ఇదివరలో ఒకే యజమాని దగ్గరో, ఒకే వృత్తిలోనో తరతరాలుగా కొనసాగాయి. సుఖపడ్డారని కాదుగాని వాళ్లు తమ చిన్న సమాజంలో ఒక భాగమనే తృప్తి వుండేది. కాని ఇక్కడ, ఫ్యాక్టరీలలో తమ మీద అజమాయిషీకి ఒక ఫోర్‌మాన్ ఉంటాడు. కొత్తమనిషి. అతడితో తమకేమీ పరిచయముండదు. ఆ ఫోర్‌మాన్ యజమానిని ఎలా సంతోషపెట్టాలనే చూస్తాడు తప్ప తమ బాగోగులు పట్టించుకోడు. గ్రామీణ వాతావరణంతో పోల్చితే, ఫ్యాక్టరీల్లో ప్రతి క్షణం భయమే. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో, ఎప్పుడు ప్రాణం పోతుందో తెలియదు. రోజుకు 12 నుండి 18 గంటల చొప్పున, వారానికి ఆరున్నర రోజులు పనిచేసిన కార్మికులు పనికోసమే బతికారు. బతకటం కోసమే పనిచేశారు.

> **ఇక వీళ్ల నివాసాలలో అడుగుపెట్టటానికే వీలులేదు. 'రెండు గదులు, ఒక సెల్లార్, ఒక మేడగది' వున్న ఇళ్లల్లో ఇరవై మంది ఉంటారు. 120 మందికి ఒక లేవేటరీ, ఒక స్నానాల గది ఉంటాయి. మనుషుల, జంతువుల దుర్గంధంతో ముక్కుపుటాలు పగిలిపోతాయి. ఇళ్లలో గాలాడదు. అందువల్ల ఆ దుర్వాసనలు తగ్గే అవకాశమూ లేదు. అందరూ జౌళి మిల్లుల్లో పనిచేస్తారు. కాటన్ దుస్తుల్లోనే ఉంటారు. ఉన్న దుసులు ఖరీదెక్కువ. అవి కొనగల సత్తా వాళ్లకు లేదు. అన్నీ రంగు వెలసిన దుస్తులే. ఎవరి దుస్తుల మీదైనా ఇంకా రంగు కనిపిస్తున్నదంటే, అతడు ధనవంతుడన్నమాటే. చలి నుండి కాపాడుకోవటానికి హ్యాట్‌లు పెట్టుకోవటం అవసరం. కాని వాటిని కొనగల స్థోమతు వాళ్లకు లేదు. చేతులకు 'గ్లవ్స్', కాళ్లకు 'మేజోళ్లు' లాంటి మాటలు కూడా వాళ్లకు తెలియవు. బూట్లు ఒక లగ్జరీ. ఆడ, మగ, పిల్లలు అందరూ బోసికాళ్లతోనే నడుస్తారు.** ”

వీళ్లంతా దురదృష్టవంతులనుకుంటే, ఈ 'సుఖానికి' కూడా దూరమైన నిరుద్యోగులు మరెందరో! వందలు, వేలు కాదు.. లక్షల్లోనే వున్నారు. కాని వాళ్లంతా ఎవరికీ కానరాని, మనుషులు. వాళ్ల గొంతు ఎవరికీ వినిపించదు. నిరక్షరాస్యులు. అడగలేరు. వాళ్లను సమీకరించగల నాయకుడు లేడు. ఎవరికివాళ్లు గా శక్తిహీనులు. దర్జీలు, వడ్రంగులు, ప్రింటర్ల లాంటి వారి పరిస్థితి కాస్త మెరుగ్గా వుంది. మేధావులకు ఈ మనుషులు తెలియదు గాని నిరుద్యోగులు చాలామంది ఆకలికి మాడుతున్నారని తెలుసు.
ఈ వృత్తి పనివాళ్లు, మేధావులు, రాత్రుళ్లు కాఫీహౌసులలో, మద్యశాలల్లో కూర్చుని 'సమాజం ఎలా మారాలి?' అని సుదీర్ఘంగా చర్చించారు.

రవాణా సౌకర్యాల వల్ల, వాణిజ్యమే కాదు, సమాచార వ్యవస్థ కూడా విస్తరించింది. యూరప్‌లో అక్షరాస్యత 50 శాతానికి మించలేదుగాని అందర్లోనూ కొత్త విషయాలు

తెలుసుకోవాలనే తపన పెరిగింది. పుస్తకాలకు దేశ సరిహద్దులను దాటి అంతర్జాతీయ పాఠకులు పెరిగారు. ధనికులనూ, నిరుపేదలనూ అత్యంత వాస్తవికంగా చిత్రించిన చాల్జాక్, విక్టర్ హ్యూగో, డికెన్స్ లాంటి రచయితలు తమ సార్వజనీనమైన నవలలతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్నారు. ఇదివరకు కేవలం స్థానిక రచయితల గురించి మాత్రమే మాట్లాడుకున్న మేధావులు ఇప్పుడీ అంతర్జాతీయ రచయితలను గురించి చర్చించారు.

రవాణాతోపాటు వార్తాపత్రికలు గ్రామీణులకు కూడా అందుబాటులోకి వచ్చాయి. స్థానిక ప్రభువుల సెన్సార్లను దాటి అవి పాఠకులకు అన్నిరకాల వార్తలనూ చేరవేశాయి. అత్యంత క్రూరమైన నిరంకుశపాలన కొనసాగుతున్న రష్యాలో కూడా (అక్కడి చక్రవర్తి జార్ నికొలస్ I పన్నెండు సెన్సార్‌షిప్ ఏజెన్సీలను ఏర్పాటు చేశాడు) అధికారుల కళ్లుగప్పి పత్రికలు సామాన్య పాఠకుడికి చేరాయి. మార్క్స్ మిత్రులు పావెల్ అన్నెకోవ్ చెప్పినట్టుగా 'ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే అందుబాటులో వున్న పత్రికలు ఇప్పుడు అందరి ఇళ్లకూ చేరుతున్నాయి.'

ఈ నూతన సమాచార వ్యవస్థలో అన్నింటికన్నా ప్రమాదకరమైన అంశం –ట్రావెలింగ్ సేల్స్‌మేన్– ఊళ్లు తిరిగి వస్తువులమ్ముకునే వ్యాపారస్తులు –. వీళ్లు తమ బుర్రల్లో, మనసుల్లో నాటుకున్న విప్లవ బీజాలను తాము తిరిగిన చోటల్లా నాటారు. విద్యాభ్యాసం కోసం ఇతర నగరాలు, దేశాలకు వెళ్లిన వాళ్లు కొత్త భావజాలాన్ని వంటపట్టించుకున్నారు. పువ్వుల మధ్య పరపరాగ సంపర్కంలా సాగిన, ఈ ప్రక్రియ ఫ్రెంచి, అమెరికన్ ప్రజాస్వామ్య భావనల వ్యాప్తికి దోహదం చేసింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోనూ ఇటలీలోని మిలాన్ నగరంలో కూడా కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రజాస్వామ్యాన్ని వెన్నంటే వుంటుంది సోషలిజం, కమ్యూనిజం. ఇవిమాత్రమే సమసమాజాన్ని సాధించటానికి చోదకశక్తులన్న నమ్మకం బలపడింది. ముఖ్యంగా, పేదలకు, అన్నార్తులకు, పీడితులకు ఇదే ఆశాకిరణం. స్వదేశాలలో ఉద్యమాలు చేసి, బహిష్కృతులై ఇతర దేశాలకు శరణార్థులుగా వచ్చిన నాయకులు ఈ భావాలను బలంగా ప్రచారం చేశారు.

అప్పటికి యూరప్‌లో నిరసన ఉద్యమాలు అంతగా పుంజుకోలేదు. 'పారిశ్రామిక వ్యవస్థ' అనబడే భూతాన్ని ఎలా ఎదుర్కోవాలో ఎవరికీ తెలియదు. కాకపోతే క్రితం సంవత్సరం జరిగిన సిలేషియన్ కార్మికుల ఉద్యమం నిరసనలకు ఊతమిచ్చింది. ('కార్మిక ఉద్యమానికి ఇదే నాంది' అన్నాడు ఎంగెల్స్) 1845లో స్విట్జర్లాండ్‌లోని లూసెర్న్‌లో జరిగిన మత రాజకీయ ఘర్షణల్లో

విక్టర్ హ్యూగో

“ కార్ల్ దూరంగా వున్న సమయంలో లెంచెనూ, పసిపిల్లనూ తీసుకుని ట్రీయర్‌కు వెళ్లాలనుకుంది జెన్నీ. అప్పటికామె ఆరు నెలల గర్భవతి. ఆ పరిస్థితిలో ప్రయాణం చెయ్యటం కష్టమే. కాని ఇంటివద్ద తల్లి ఎడ్గార్‌తో గొడవపడుతున్నది. సంవత్సరాలపాటు వాయిదావేసి, ఎడ్గార్ లా పరీక్షలైతే రాశాడుగాని ఉద్యోగ ప్రయత్నాలేమీ చెయ్యటం లేదు. కొలోన్‌లో చదువుకుంటున్నప్పుడు రాడికల్స్‌తో తిరిగి తల్లి పంపిన డబ్బులన్నీ నీళ్లలాగా ఖర్చుపెట్టాడు. 'విప్లవం కోసం, పీడిత మానవాళి విముక్తి కోసం' ఈ మాత్రం త్యాగం చెయ్యాలన్నాడు. కాని, నిజానికా డబ్బులన్నీ జల్సాలతో తగలేశాడు. చిన్నప్పుడు జెన్నీ అతణ్ణి ఎంతో గారబం చేసింది. కాని ఇప్పడే కొరకరాని కొయ్యతో ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఈ విషయమే మార్క్స్‌తో చెప్పింది. ఎడ్గార్ బ్రసెల్స్‌కు రావాలనుకుంటున్నాడు. కనీసం అలాగైనా తన తల్లి తలనొప్పి కొంత తగ్గుతుంది. ఆ నమ్మకంతో తను ప్రష్యాకు ప్రయాణమైంది. మార్క్స్, ఎంగెల్స్‌లు ఇంగ్లండుకు చేరుకుని ఆరువారాల పాటు మాంచెస్టర్‌లో గడిపారు. ”

వందమంది హతులయ్యారు. సామాజిక సంస్కరణల కోసం ఉద్యమించిన వారికి ఇవి చెకుముకి రవ్వల్లా కనిపించాయి.

యూరప్‌లోని అన్ని దేశాల ప్రభువులు కూడా ఈ పరిణామాలను గమనిస్తూనే వున్నారు. ఇదివరలో, ఇతర రాజ్యాలతో మాత్రమే యుద్ధాలు చేశారు. కాని ఇప్పుడదందరూ 'మానవ హక్కులు' కోసం యుద్ధం చేస్తామంటున్నారు. అమెరికా, ఫ్రెంచి విప్లవాల తర్వాత ఈ ధోరణి బాగా పెరిగింది. సాటి ప్రభువులే కాదు. తమ ఆస్థానాలలోని అరిస్టోక్రాట్లు, బూర్జువా మేధావులు, చిన్న వ్యాపారస్తులు కూడా యుద్ధానికి కాలుదువ్వుతున్నారు.

యూరప్ చరిత్రలో ఇంతవరకు ఇలాంటి పరిణామాలు జరగలేదు. శతాబ్దాలుగా సమాజ స్వరూపం పెద్దగా మారలేదు. రాజాజ్ఞలనెవరూ ఉల్లంఘించటానికి ప్రయత్నించలేదు. సమాజంలోని ప్రతివర్గం వాళ్లూ, తమ పైవర్గం వాళ్ల ఆధిపత్యాన్ని సహజంగా అంగీకరించారు. కాని ఇప్పుడా పరిస్థితి మారింది. అయితే పాతవ్యవస్థను కాదని వచ్చిన కొత్తవ్యవస్థ ఎలా ఉండబోతోంది? ఆ విషయం ఊహించటం అంత కష్టమేమీ కాదు. యూరప్ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో తెలుసుకోవాలంటే ఇంగ్లీష్ ఛానెల్ దాటాలి. అక్కడ ఎంగెల్స్ వున్నాడు. 1845లో తన సహచరుడు కార్ల్‌మార్క్స్‌ను కూడా పిలిపించుకున్నాడు.

లండన్, 1845

ఇంగ్లండు వెళ్లటానికి ముందే మార్క్స్, ఎంగెల్స్, ఈ 'సైద్ధాంతిక చెత్త' గురించి ఒక అవగాహనకు వచ్చారు. సిద్ధాంతాలు, అభిప్రాయాలు అర్థవంతంగా వుండాలంటే – మత, రాజకీయ, ఆర్థిక విషయాలేవైనా – వాస్తవ, భౌతిక పరిస్థితుల నుండి రూపుదిద్దుకున్నవై ఉండాలి. వాస్తవ పరిస్థితుల గురించి చర్చించకూడదు, ప్రచురించకూడదు అని ప్రభుత్వం నిషేధం విధించటంతో, జర్మన్ మేధావులు తమ తాత్వికతకు మహోన్నత ఆశయాలు ఆపాదించి, ఆకాశవీధుల్లో విహరించారు. చివరికి సోషలిస్టులు కూడా 'మానవతా వాదం', 'బాధ, దుఃఖం' లాంటి మాటల చాటున దాక్కున్నారు. నిజానికి వాళ్లు చెప్పదలచుకున్నది 'మనిషి, ఆకలి,' గురించి. భౌతిక విషయాల గురించి చర్చించినప్పుడు వాటిని కప్పుతున్న సైద్ధాంతిక ముసుగును తొలగించవలసిన అవసరం వుందని వాదించాడు మార్క్స్. తన పదకొండు అంశాల Theses on Feuerbach లో మార్క్స్ ఈ విషయాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు:

'తత్వవేత్తలు ఈ లోకం గురించి వ్యాఖ్యానించారు. కాని దాన్ని మార్చటం ముఖ్యం.' విస్పష్టమైన ఈ అవగాహనతో కార్యాచరణకు పిలుపునిచ్చిన మార్క్స్, తను రాయబోయే పుస్తకానికి వచ్చిన 1500 ఫ్రాంకుల అడ్వాన్సుతో (ఇంకా రచన ప్రారంభమే కాలేదు) ఎంగెల్స్‌తో కలిసి ఇంగ్లండుకు ప్రయాణమయ్యాడు.

జౌళి ఫ్యాక్టరీలలో సుమారు అయిదు లక్షల మంది పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమకు కేంద్రం మాంచెస్టర్. సామాజిక శాస్త్రజ్ఞుడికి, పారిశ్రామికీకరణ పరిణామాలు అధ్యయనం చెయ్యటానికి ఇంతకన్నా అనువైన ప్రయోగశాల మరొకటి వుండదు. వీళ్లు అక్కడికి చేరేనాటికే, ఒకప్పుడు కుటీరపరిశ్రమగా వున్నది కాస్తా, ఫ్యాక్టరీవ్యవస్థగా మారిపోయింది. ఒక్కో యజమాని వద్ద కొంతమంది నేతగాళ్లు పనిచేసేవాళ్లు. అతడే వాళ్ల బాగోగులు చూడటం ఆనవాయితీ. కాని ఫ్యాక్టరీలలో అనామకమైన, అపరిచితులైన యజమానుల వద్ద పనిచెయ్యాలి. పని ముగిశాక కూలీ పంచటం తప్ప, ఈ యజమానులు కార్మికుల గురించి పట్టించుకోరు. యజమాని ఏకైక లక్ష్యం వీలైనంత లాభం ఆర్జించటమే. ఫ్యాక్టరీ వ్యవస్థలో మనిషి మనిషి కాడు. అతడు యంత్రంలోని ఒక

భాగం మాత్రమే. నిజానికతడు కుటుంబ పెద్ద కూడా కాదు. ఆడవాళ్లు, పిల్లలు కూడా ఇక్కడే పనిచేస్తున్నారు.

బ్రిటన్‌లోని అతి పురాతనమైన ప్రభుత్వ గ్రంథాలయం చెతామ్ లైబ్రరీలో కొనసాగింది వీళ్ల అధ్యయనం. లోపల కూర్చోవటం వల్ల వీధుల్లో పొగచూరకుండా తప్పించుకున్నారు. (ఫ్యాక్టరీల పొగతో నగరమంతా నల్లబారిపోతుంది.) బ్రిటిష్ ఆర్థికవేత్తల డేవిడ్ రికార్డో ఆడంస్మిత్, డేవిడ్ హ్యూమ్, సర్ విలియం పెటీల గ్రంథాలను వడపోశారు. (మార్క్స్ రచనల్లో వీళ్ల ప్రస్తావన ఎక్కువగా ఉంటుంది.) రాత్రుళ్లు, మధ్యతరగతివాళ్లు అలవాటుగా వచ్చి కూర్చునే మద్యశాలలో గడిపారు. మేరీ బర్న్స్‌తో కలసి కూలీపేటలలో తిరిగారు. అక్కడ శనివారం రాత్రుళ్లు మహా హడావిడిగా వుంటుంది. కార్మికులు తమ కూలీ కోసం గంటలకొద్దీ క్యూలలో నిరీక్షిస్తారు. కాసేపటికి వాళ్ల శ్రమ చిల్లర డబ్బుగా మారుతుంది. డబ్బుల కోసం చాచిన చేతులు స్వేచ్ఛను కోరుకుంటాయి. కొన్నిసార్లు, వాళ్ల కూలీని మద్యశాలల్లోనే పంపిణీ చేసేవారు. అంటే ఇక ఇంటికి ఖాళీ చేతుల్తోనే వెళ్తారు. తమ శ్రమ వల్ల, చివరికి కొద్దిపాటి ఆనందమైనా పొందగలుతున్నామనే భ్రమలో వున్నారు వీరంతా. ఎవరైనా, డబ్బులు దాచుకుని, ఇంటికోసం వస్తువులు కొందామని మార్కెట్‌కు వెళ్లినా, ధనవంతులు నాసిరకమని నిరాకరించిన దినుసులు, కుళ్లిన కూరగాయలూ, మాంసం మాత్రమే వుంటాయి. బురదలో, మురికిలోనే అక్కడ అమ్మకాలు కొనసాగుతాయి. కార్మికుల దుర్భర పరిస్థితికి ఇది మరో ఉదాహరణ.

ఆశలడుగంటిన ఈ అధోలోకంలో కుటుంబ జీవితం చిన్నాభిన్నమైపోయింది. పని చెయ్యక తప్పని తల్లులు పసిపిల్లలకు నల్లమందిచ్చి పడుకోబెట్టి



ఫ్యాక్టరీలకెళ్లారు. ఆర్థిక భారం తగ్గించుకోవటం కోసం పన్నెండేళ్ల కూడా నిండని ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి పంపేశారు. ఆరేళ్ల పిల్లలు వీధుల్లో ముష్టెత్తుకుంటూ కనిపించారు. ఒకప్పుడు ఇంటి పెద్దలుగా వున్న తండ్రులు ఇప్పుడు, పదిపన్నెండేళ్ల తమ పిల్లలతో కలసి కూలీకెళ్లి క్యూలో నిలబడ్డారు. జబ్బుపడినవాళ్లకు చావే గతి. మందులు కొనే స్థోమత ఎవరికీ లేదు. అనారోగ్యం కన్నా, ప్రమాదాల బారినపడటం కన్నా మరణమే మేలనుకున్నారు – వీళ్ల ఇతర్లకు భారం! అంత్యక్రియల్లో, మరణించినవాళ్లను అదృష్టవంతులు అంటూ పొగడ్తలతో ముంచారు.

జీవిత వాస్తవికతను తెలుసుకోవాలనుకున్న మార్క్స్‌కు అది మాంచెస్టర్‌లో పుష్కలంగా లభించింది. ఇంతవరకూ అతడికి కార్మికుల జీవన పరిస్థితుల గురించి అవగాహన లేదు. ఈ నరక కూపాలు నమ్మలేనినిజాలు. పారిస్‌లో కార్మికులను చూశాడు. వాళ్లతో మాట్లాడాడు. కాని ఈ అనుభవం వేరు. కార్మికులవాడ అంటే మోకాలిలోతు మురికిలో కూరుకుపోవటం – భౌతికంగానూ, మానసికంగానూ ఆ దృశ్యాలు, ఆ శబ్దాలు, ఆ వాసనలు ఎవర్నైనా షాక్ చేస్తాయి. మార్క్స్ ఒక మధ్యతరగతి మేధావి. భార్య అరిస్టోక్రాట్. ఇంతవరకూ సంస్కారవంతులతో చర్చలలో మాత్రమే పాల్గొన్నాడు. ఇప్పుడు ఉన్నపళంగా అనూహ్యమైన మానవ పతనాన్ని ప్రత్యక్షంగా చూశాడు. ఇంతవరకూ 'సిద్ధాంతాలు వద్దు.... భౌతిక వాస్తవికత ముఖ్యం' అన్నప్పుడు అదీ ఓ సిద్ధాంతమే. ఇక ఆ పరిస్థితి మారింది. మాటలు కాదు. చేతలు కావాలి.

సుమారు నలభై అయిదు రోజుల తర్వాత మిత్రులిద్దరూ మాంచెస్టర్ నుండి లండన్ చేరుకున్నారు. పారిశ్రామికీకరణ ప్రభావానికి ఇది మరో పార్శ్వం. 'ఇక్కడి వీధుల్లో నడవటానికి కూడా చోటుండదు' – అయినా అందరూ ఎవరికివారు ఒంటరులమనే అనుకుంటారు' – ఎంగెల్స్. గుంపులో వున్నా ఒకర్నొకరు పట్టించుకోనితనం. మాంచెస్టర్‌లో ధనికులూ, పేదలూ వేర్వేరుగా బతుకుతారు. నగర నిర్మాణమే అలా జరిగింది. పేదరికం ఎలా వుంటుందో తెలియనంత దూరంలో ఉంటాయి ధనికుల విలాస భవనాలు. – అలకాపురికి నకలు ఆ మాంచెస్టర్. కాని లండన్‌లో అలా కాదు. ఇక్కడి వీధుల్లో ధనికుల పక్కనే నడుస్తారు పేదలు. – కాని ఇద్దరూ వేర్వేరు జాతులకు చెందిన జీవుల్లా ఉంటారు. పక్కపక్కనే నడిచినా ఏ సంబంధమూ వుండదు – ఏమైనా ఉంటే – అది ధనికులు నిరుపేదలను దోచుకునే సంబంధమే తప్ప, ధనికులు పేదలను దోపిడీ చేస్తారు. అవకాశం దొరికినపుడల్లా పేదలు వున్నవాళ్ల ఇళ్లలో దొంగతనాలు చేస్తారు. దోపిడీకి మారుపేరు పారిశ్రామికీకరణ. దొంగతనం మాత్రం శిక్షార్హమైన నేరం.

సశేషం

▪ ఫోన్: 91776 18708

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించీ రాసి పంపవచ్చు. మట్టిలో మాణిక్యాల్లా స్వశక్తితో విజయాలు సాధించినవారి గురించీ పంపవచ్చు. ఒకవేళ అవేవీ రాయలేకపోయినా సలహాలు, సూచనలు ఇచ్చినా సంతోషమే. వారికీ ఆహ్వానం. స్నేహ పత్రికలో ఇప్పుడు వస్తున్న అంశాలు కాకుండా ఇంకా సమయానుకూలంగా ఇదిగో ఇవి వస్తే బాగుంటాయి. అని మీకనిపిస్తే మాకు తెలియచేయండి. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్.

రచనలను పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1,
ఆజామాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

ఆరు తేడాలు చెప్పుకోండి

ఓ వేటగాడు తుపాకీతో అడవికెళ్లాడు. ఇక చూస్కోండి. ఎక్కడి జంతువులక్కడ గప్‌చుప్. ఈ రెండు బొమ్మలూ ఒకేలా వున్నా ఆరు తేడాలున్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.

రెండు రేబిట్లు

ఇక్కడ ఆరు కుందేళ్లు చక్కగా క్యారెట్లతో నిలబడ్డాయా! అన్నీ చూడ్డానికి ఒకేలా కూడా వుంటాయి. కానీ రెండు మాత్రమే అచ్చం ఒకేలా వుంటాయి. అవి ఏవో చెప్పకోండి.



జవాబు: ఒకటి , ఐదు

పొడుపు కథ

1. ఎనిమిది కాళ్ళు అడ్డంగా నడుస్తాయి. ఎవరబ్బా?
2. ఎముకల్లేని జీవం ఏటికి పోయె. ఎవరై వుంటుంది?
3. ఎర్రని దొరకు నల్లని టోపి. చెప్పుకోండి?
4. ఎర్రని పండు మీద ఈగైనా వాలదు. తెల్సిందా?
5. ఎవరూ దిగని బావిలో భీముడు దిగాడు. ఎవరా భీముడు?

జవాబులు : 1.ఎండ్రకాయ, 2. వానపాము, 3. గురిగింజ, 4. నిప్పు, 5. గరిటె

రంగులేసేద్దాం

ఇక్కడో బుజ్జి బాతు వుంది కదా. దీనికి గానీ రంగులేశారో అదిరిపోతుంది. అయితే మేం చెప్పిన రంగులేసి చూడండి.

1-ఎరుపు, 2-పసుపు, 3-నీలం, 4-ఆకుపచ్చ, 5-నారింజ, 6-వంకాయ, 7-ఇటుక రంగు, 8-నలుపు.

పావురం- కాకి

కథ

ఒక గ్రామంలో ఒక చెట్టు మీద పావురం గూడు కట్టుకుని నివసించేది. ఆ చెట్టు పక్కనే ఒక ఇల్లు ఉండేది. ఆ ఇంటి గృహిణి రోజూ ఆ చెట్టు ముందు గింజలు వేసేది. పావురం చెట్టు దిగి, ఆ గింజలు తిని వెళ్లేది. ఇలా కొంతకాలం గడిచింది.

ఒకరోజు ఒక కాకి వేరే ఊరి నుండి ఆ గ్రామానికి వచ్చి, పావురం ఉండే చెట్టుపై వాలింది. ఆ గృహిణి గింజలు చల్లడం, పావురం తినడం చూసింది.

'ఆహా! ఈ పావురం ఎంత హాయిగా జీవిస్తోందో. ఆహారం కోసం వెతికే అవసరమే లేదు దానికి. నేను కూడా ఈ ఇంట్లోని ఆహారం తినవచ్చు. కష్టపడి ఆహారం వెతికే అవసరం ఉండదు... అని మనసులో అనుకుంది.

వెంటనే ఆ కాకి.. పావురానికి కల్లబొల్లి కబుర్లు చెప్పి దానితో స్నేహం చేసింది. 'కాకి మిత్రమా! నువ్వు ఇక్కడే ఉండవచ్చు. కానీ నీ ఆహారం నువ్వు సంపాదించుకో. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఇంట్లో

ఆహారం దొంగిలించవద్దు' అని షరతు పెట్టింది పావురం.

తను అక్కడ ఉండాలనుకునేది ఆ ఇంట్లో ఆహారం కోసమే. అయినా ఆ సమయానికి 'సరే' అంది కాకి.

కొన్నిరోజులపాటు ఆ కాకి అక్కడే ఉంటూ, బయట ఆహారం సంపాదించుకునేది. ఒకరోజు ఆ ఇంట్లో నుండి చేపల వాసన వచ్చింది కాకికి. ఆ సమయంలో పావురం బయటకు వెళ్లింది. అదను కోసం ఎదురు చూస్తున్న కాకి వెంటనే ఆ ఇంట్లోకి దూరి చేపల కోసం వెతకసాగింది. తొందరలో కాకి ఒక పళ్లాన్ని పడేసింది. ఆ చప్పుడు విన్న గృహిణి అక్కడికి వచ్చి కర్రతో ఆ కాకిని తరిమేసింది.

'బతుకు జీవుడా!' అనుకుంటూ కాకి ఆ గ్రామాన్నే వదలి వెళ్లిపోయింది.

దారి కనిపెట్టేస్తే పోలా!



నీడ గుర్తు పట్టండోచ్



అనగనగా ఒక టెడ్డీ బేర్ బొమ్మ. దానికి ఐదు నీడలు. ఇందులో అసలు నీడ ఏదో చెప్పుకోండి.

ఎవరి గాలిపటం ఏదో!



రామ్ శ్యామ్ భీమ్ నోమ్

చేప బొమ్మ గీయండి



మేం చెప్పినట్టు చేశారంటే... చేప మీ ముందు వుంటుంది. మరి ఇక్కడ ఇచ్చిన పద్ధతుల్లో గీస్తూ వెళ్లండి.

ఎన్ని వున్నాయి?

ఈ బొమ్మలో మొత్తం ఎన్ని జంతువులున్నాయో చెప్పుకోండి చూద్దాం.

ముక్కలు కలిపేద్దాం!



◆ కొత్త పుస్తకాలు

వెన్నెలలాంటి కథలు

సంగీత, సాహిత్య సొబగులు అద్ది, స్త్రీ దృక్కోణం కలిగిన వాడ్రేవు వీరలక్ష్మీ దేవి రాసిన కథల సమాహారం ఈ సంకలనం. ఈ సంకలనానికి 'కిటికీ బయటి వెన్నెల' అన్న పేరు పెట్టారు. ఆ వెన్నెల ఈ కథల ద్వారా మనలోకి ప్రవేశించిందంటే అతిశయోక్తి కాదేమో! కథా రచయిత్రికి స్త్రీల పట్ల సహానుభూతే కాదు, గౌరవం కూడా ఉంది. ఆమెతో పాటు పాఠకులూ ఆ పాత్రల్ని ఆదరించి, గౌరవించాలన్నట్లే తీర్చిదిద్దారు. 'పునరుత్థానం' కథలో ఆదిలక్ష్మి, 'తన్మయి' కథలో తాయారు, 'నీడ' కథలో చెప్పే నేను, పూర్ణ, 'బరువు భారాలు'లో రాజ్యం అలాంటి పాత్రలే. ఈ కథల్లోని స్త్రీలు తమ జీవనోత్సాహాన్ని కాపాడుకుంటూ తామున్న చోటును నివాసయోగ్యంగానే కాక, అందమైన తోటలా చేసుకున్నవాళ్లు, తమ ఆశయాలను కాపాడుకున్నవాళ్లు, జీవితపు ఆటుపోట్లకు తట్టుకుని తల ఎత్తుకుని నిలబడ్డవాళ్లు, ఎక్కువ చదువులూ పెద్ద ఉద్యోగాలు లేకపోయినా తమకి స్వభావ సిద్ధంగా వచ్చిన స్తిమితాన్నీ, సంతోషాన్నీ పోగొట్టుకోకుండా నిలుపుకున్న వాళ్లు.

కిటికీ బయటి వెన్నెల
రచయిత : వాడ్రేవు వీరలక్ష్మీ దేవి,
వెల : రూ.100, పేజీలు: 120 (పది కథలు), ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, కాచీగూడ, హైదరాబాద్.

కథల్లోకి వెళితే.. వినిమయ సంస్కృతిలో కొట్టుమిట్టాడుతున్న నేటి సంస్కృతికి అద్దంపట్టే కథ 'ఈ విషానికి ఈ తేనె చాలు'. నేటి జీవన వేగం అందర్నీ అభద్రతా భావంలోకి నెట్టేస్తుంది. ఈ అభద్రతాభావం నుంచి పుట్టిందే ఇప్పటి ఆడంబర భక్తి ప్రవాహం. తెర వెనక్కి పోతున్న పుణ్యస్త్రీ వ్రతాలనూ, నమ్మకాలనూ మళ్లీ తెరపైకి తెస్తున్నది కూడా ఈ అభద్రతా భావమే. ఒకప్పుడు పాటల కచేరీలకో, ఏవైనా సభలకో వెళ్లే జనం నేడు ఈ సాధు సత్సంఘాలకు తరలిపోతున్నారు. ఏనాడో వదిలేసిన మూఢనమ్మకాలను పునరుద్ధరించే పని పెట్టుకోవడం వెనుక కుట్ర ఏమిటి? ఈ మాయలో పడి జీవనోత్సాహాన్ని పోగొట్టుకుని, మళ్లీ 'ఎంత కష్టపడి బయటికొచ్చాం మనం? మళ్లీ మనల్ని ఎక్కడికి తీసుకుపోతారో ఏమో' అనే ఆలోచనతో తెప్పరిల్లుకున్న ఒక ఆధునిక స్త్రీ కథ ఇది. అలాగే సంకలనంలోని మొదటికథ 'పునరుత్థానం' కథ. దీనిలో ఆదిలక్ష్మికి ముందు నుంచీ అన్నీ కష్టాలే. అయినా ఆదిలక్ష్మి ఆ ఇంటిని నందనవనంలా ఉంచుతుంది. అయితే ఆమె కష్టాలు రెట్టింపు అవుతాయి. దీంతో ఆమె ఉన్న ఊరూ, ఇల్లు వదిలి ఆమె మరో ఊరికి కూలిపనికి పోతుంది. అయితే పరిస్థితుల్లో మార్పేమీ లేదని, మళ్లీ ఇంటికి తిరిగొచ్చేస్తుంది. మళ్లీ ఇంటిని నందనవనం చేస్తుంది. మళ్లీ బతుకుపోరులో మునిగిపోతుంది. బతుకు బరువైనప్పుడల్లా ఎవరో ఒక ఆదిలక్ష్మి ఇలా మనకి దారి చూపుతుందేమో అన్నట్లు గొప్ప ఆశను కలిగించే కథ ఇది. కౌన్సిలర్ల పాత్ర, సమకాలీన విద్యా సంస్కృతికి అద్దంలాంటి కథ 'దిశా నిర్దేశకులు'. ఇక ఈ సంకలన టైటిల్ అయిన 'కిటికీ బయటి వెన్నెల' కథలోకి వస్తే.. తన ఇంట్లో ఉన్న కిటికీ లోంచి కనిపించే ఒక అపార్టుమెంటు వాసుల జీవన చిత్రాన్ని చూడడం ఆమెకు చాలా ఇష్టం. తూర్పువైపు నిమ్మచెట్టులాగా, ఉత్తర దిక్కున వేపచెట్టు కొమ్మల మధ్య నుంచీ కనిపించే ఆకాశంలాగే, ఈ మనుషులూ, వాళ్ల ఆనందాలూ, పోట్లాటలూ అతి సహజంగా కనిపిస్తాయి. 'వాళ్లను గురించి తెలుసుకోవడ మెందుకు? ఈ మూడు దిక్కులూ నాకు కనులకింపుగా ఉండే దృశ్యాలను ఎట్లా చూస్తున్నానో అట్లాగే వాళ్లనూ చూస్తాను. కిటికీ ముయ్యను' అని. మనుషులను వాళ్లలాగే ఇష్టపడడం ఎంత గొప్ప విషయం! కంటికి ఇంపు అని నిర్ధారించేవి బాహ్య చక్షువులే కాదు, అంతర చక్షువులు కూడా. 'తన్మయి' కథలో తన తీరని కోరికను మనమరాలి ద్వారా తీర్చుకుంటుంది. పాట కోసం పడిన తపనను అత్యంత సహజంగా ఈ కథలో చెప్పారు.

'ఆరాత్రి' కథలో దాడి జరిగిన ఆడపిల్లను పొదవి పట్టుకుని, సమాజానికి ఎదురీదిన తల్లిపాత్రకు ప్రతి ఒక్కరూ తలొంచాల్సిందే. 'బరువు భారాలు' కథలో కుటుంబవ్యవస్థ విచ్ఛిన్నాన్ని కళ్లకు కట్టారు. 'గీతలు చెరుపుకోవచ్చు' అన్న కథ విడిపోయాక ఏర్పడ్డ సరిహద్దు గీతల్ని, అత్యవసర వేళల్లో చెరుపు కోవచ్చు అనే సందేశమిచ్చేది. 'నీడ' కథలో పూర్ణ పాత్రతో 'ఒక్కోసారి మోస పోతే పోవచ్చు. అలాగని హృదయాన్ని బంధించుకుని తప్పించుకుపోతే ఎలా?' అని అనిపించడం మనల్ని ముందుకే నడవమని చెప్తుంది. ఇలా ఈ సంకలనంలో మనం ఏరుకోవాలే గానీ సౌగంధ కుసుమాలు చాలానే ఉన్నాయి.

- శాంతిశ్రీ

◆ స్వీకారం

తుడుం
సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి
పేజీలు : 112 ; వెల : రూ.60/-,
ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్, కారల్‌మార్క్స్ రోడ్, జలీల్ వీధి, విజయవాడ-2; దిశ బుక్ సెంటర్, త్రినేత్ర సూపర్ మార్కెట్ ఎదురుగా, చిక్కడపల్లి, హైదరాబాద్; మణి బుక్ స్టాల్, సండే మార్కెట్, నెల్లూరు; శ్రీకాకుళ సాహితి, 'హరిత' 11-2, విశాఖ 'ఏ' కాలనీ, శ్రీకాకుళం-532001.

27 ఏళ్ల సందర్భ జ్ఞాపిక
సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి
పేజీలు : 48 ;
ప్రతులకు : శ్రీకాకుళ సాహితి, 'హరిత' 11-2, విశాఖ 'ఏ' కాలనీ, శ్రీకాకుళం-532001.



జముకు (తొమ్మిది బులెటిన్ల సంకలనం),
కూర్పు : శ్రీకాకుళ సాహితి
పేజీలు : 212,
వెల : రూ.100/-,
ప్రతులకు :
బి.వి.ఎ.రామారావు నాయుడు, హరిత,
శ్రీ విశాఖ 'ఏ' కాలనీ,
శ్రీకాకుళం,
సెల్ : 9441095961

గబ్బిలాలకూ ఓ ఆసుపత్రి

అదేంటి అలా ఆశ్చర్యపోతున్నారు? మీరు చదివింది, చూసేది నిజమేనండి! గబ్బిలం తలకిందులుగా వేలాడుతూ ఉంటుంది. వాటిని చూడటానికే సహజంగా ఎవరూ ఇష్టపడరు. ఇవి నల్లగా ఉండి, అదో రకమైన శబ్దాలు చేస్తుంటాయి. అవి ఉన్న వాతావరణం భయగొల్పుతూ ఉంటుంది. గబ్బిలం పేరుతో ఒక కావ్యాన్నే రాశారు. అయితే ఆస్ట్రేలియా వాళ్లు ఏకంగా వీటికి ఓ ఆసుపత్రినే పెట్టేశారు. ఈ ఆసుపత్రి ఆస్ట్రేలియాలోని టాక్స్ సిటీలో ఉంది. ఈ బుజ్జి బుజ్జి గబ్బిలాలను ఆసుపత్రిలో ఉంచి చికిత్స చేస్తున్నారు. చిన్నారి పాపాయిల్ని ఎంత శ్రద్ధగా చూసుకుంటామో ఈ బుజ్జి గబ్బిలాల్నీ అంతకన్నా ఎక్కువ శ్రద్ధగా చూస్తున్నారు ఈ ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది. గబ్బిలాలకు పక్షవాతం (పెరాల్‌సిస్) వచ్చి చనిపోవడంతో వీటిని సంరక్షించే బాధ్యతను ఆస్ట్రేలియన్లు తీసుకున్నారు. వ్యాధి సోకిన, గాయపడిన బేబీ గబ్బిలాలను ఆసుపత్రికి తీసుకొచ్చి ఇక్కడ చికిత్స చేసి, సంరక్షిస్తున్నారు. వీటి ఆరోగ్యం సరి కాగానే మళ్లీ వాటిని అరణ్యంలో వదిలేస్తారట. ఈ ఆసుపత్రి నేడు ఓ ప్రదర్శనశాలలా మారిపోయింది. ఈ ఆసుపత్రిలో పదవీ విరమణ చేసిన వారు సేవ చేస్తున్నారు. ఈ బుజ్జి బుజ్జి గబ్బిలాలకు చిన్ని చిన్ని చుక్కల చుక్కల, చారల చారల దుప్పట్లు, తేనె పీకలు, బుజ్జి బుజ్జి పాల సీసాలు ఉపయోగిస్తున్నారు. అవి భలే ముద్దు ముద్దుగా బుజ్జిగా ముద్దొచ్చేస్తున్నాయి. అచ్చం పసిబిడ్డల్ని చూసినట్లు చూస్తున్నారనుకోండి!

ఇక్కడి బొమ్మల్ని చూస్తే మీకూ అదెంత నిజమో తెలిసిపోయిందనుకుంటా!

ఇదో రకం సృజనాత్మకత !

‘పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి’ అన్నారు పెద్దలు. ఈ బొమ్మల్ని చూస్తుంటే అది అక్షర సత్యమనిపిస్తోంది కదూ! లేకపోతే చక్కటి వేళ్లకు అస్తిపంజర చేయిలాంటి తొడుగు, చుట్టేసుకున్న బల్లి, కంపలో గుడ్లగూబ రాకాసి పక్షి నోట ఉన్న పాము వంటి ఆకారాల్లో చేతి వేళ్లకు ఉంగరాల్లా తయారుచేశారు. ఇదీ ఒక విధమైన సృజనాత్మకతే. గాజు గోళంలో ఓ సముద్రం.. అందులో ఓ దీవి.. ఆ దీవిపై పచ్చని చెట్లు.. వాటి మధ్యలో చిన్న ఇల్లు.. ఇదంతా కలిపి ఓ వేలికి ఉంగరం తయారైంది. ఓ ఎలుక, ఓ కుందేలు వేలును చుట్టేసుకుని వేలాడుతున్నట్లు, జింక కొమ్ములు కూడా వేలికి తగిలించుకున్నట్లు తయారుచేశారు. అలాగే వివిధ రకాల పుట్టగొడుగులన్నీ కలిసి ఒకచోటే ఉన్నట్లు తయారైన ఉంగరం కూడా ఆకర్షించేలా ఉంది. మనవాళ్లకి ఉంగరాల పిచ్చి బాగానే ఉందండోయ్! కొంతమంది చేతికున్న పదివేళ్లకూ ఉంగరాలు పెట్టేస్తుంటారు. ఇంకొంతమందైతే ఒక వేలుకే రెండు, మూడు పెట్టేస్తుంటారు. అలాంటి వాళ్లు ఇలాంటి ఉంగరాలు ప్రయత్నిస్తే ఆ మోజు ఏమన్నా తీరుతుందేమో!